




# DD9 వార్త

తెలుగు దినపత్రిక


## త్వరలో యూనిఫాం ట్యాక్స్ సిస్టమ్

- మూడు కార్పొరేషన్లలో ఒకే విధానం అమలు యోచన
- రెండు ట్యాక్స్ విధానాలపై అధికారుల అధ్యయనం
- విలీన ప్రాంతాల్లో మార్కెట్ వ్యాల్యూ ప్రకారం..
- జీహెచ్ఎంసీ పాత పరిధిలో రెంటల్ విధానం
- కొత్త ఆర్థిక సంవత్సరంలో ఒకే పన్ను విధానం
- ఏప్రిల్ తర్వాత సర్కార్ తుది నిర్ణయం





సంపుటి : 01 సంచిక : 193 హైదరాబాద్, మార్చి, మంగళవారం 03, 2026 పేజీలు : 06 వెల : 3.00


# మైనింగ్ ఈవేలంలో భారీ అక్రమాలు

- సూర్యాపేట జిల్లాలో వేలంలో అవినీతి
- విచారణ చేపట్టి టెండర్లు రద్దు చేయాలి
- 1,100 ఎకరాల రిజర్వ్డ్ ఫారెస్ట్‌పై స్పష్టత లేకుండానే వేలం
- కంపెనీల ఎంపికపై అనుమానాలు
- టెండర్ రద్దు చేసి కొత్తవేలం నిర్వహించాలి
- సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ లేఖ



హైదరాబాద్, (డిడి9 వార్త):

మైనింగ్ బ్లాకల ఈవేలం ప్రక్రియలో తీవ్రమైన అక్రమాలు, విధానపరమైన లోపాలు, చట్ట ఉల్లంఘనలు జరిగాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సూర్యాపేట జిల్లాలోని ఈ వ్యవహారంపై తక్షణమే స్వతంత్ర విచారణ జరిపి, వివాదాస్పద టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి సోమవారం లేఖ మిగతా 2లో..

# కాంగ్రెస్ అసలు రంగు పూర్తిగా బయటపడింది

- ఉద్యోగుల కుటుంబాల్లో విషాదం నెలకొంది
- ప్రభుత్వం మారినా పరిస్థితి మారలేదు
- విశ్రాంత ఉద్యోగులకు బకాయిలు చెల్లించండి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు
- ఇందిరాపార్క్ వద్ద నిరాహార దీక్ష

హైదరాబాద్, (డిడి9 వార్త):

ఇచ్చిన హామీలు అమలుచేయని, విశ్రాంత ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలను చెల్లించని రాష్ట్ర ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మిగతా 3లో..





# రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం

- ప్రజల నుంచే నాయకుడిగా ఎదిగాను
- జడ్పీటీసీ నుంచి సీఎం స్థాయికి వచ్చాను
- పదవుల కన్నా నమ్మకమే ముఖ్యం
- నిస్వార్థంగా ప్రజా సేవ చేస్తున్నాం
- రాజకీయాల కన్నా నమ్మకమే ముఖ్యం
- పీఏసీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

డిడి9 వార్త, హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ కాంగ్రెస్ శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల హాజరయ్యారు.

**జెడ్పీటీసీ నుంచి ముఖ్యమంత్రిగా**

సమావేశంలో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, తాను 19 ఏళ్ల వయసులోనే జెడ్పీటీసీ స్థాయి నుంచి రాజకీయాల్లోకి అడుగు పెట్టానని తెలిపారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన తాను ప్రజల మధ్య నుంచి ఎదిగానని చెప్పారు. గ్రామ స్థాయి రాజకీయాల నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి చేరుకోవడం సులభం కాదని, ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నానని గుర్తు చేశారు. రాజకీయాల్లో ఎప్పుడూ ప్రజా సమస్యలపైనే తన పోరాటం సాగిందని చెప్పారు. అధికారుల వద్ద పైరవీలు చేయడం, వ్యక్తిగత లాభాల కోసం రాజకీయాలు చేయడం తన స్వభావం కాదన్నారు. ప్రజల కోసం మాట్లాడినందుకే తనపై అనేక కేసులు పెట్టారని, కోర్టుల వరకు వెళ్లాల్సి మిగతా 2లో..

# గల్ఫ్‌ను కమ్మేసిన యుద్ధ మేఘాలు


- భారతీయుల రక్షణపై కేంద్రం దృష్టి
- వందలాది విమానాలు రద్దు
- ప్రత్యేక ఎయిర్‌లిఫ్ట్ కోసం చర్యలు
- ఉపాధి కోసం వెళ్లిన వేలాది మంది దుబాయ్‌లో చిక్కుకున్న పర్యాటకుల వేదన
- యూఏఈ అధ్యక్షుడితో మోడీ చర్చలు

డిడి9 వార్త, న్యూఢిల్లీ


పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఇరాన్, అమెరికా సంయుక్త రాష్ట్రాలు-ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న సైనిక ఘర్షణలతో గల్ఫ్ ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. ఈ పరిణామాల దృష్ట్యా పలు పశ్చిమాసియా దేశాలు తమ గగనతలాన్ని పూర్తిగా మూసివేశాయి. కొన్ని దేశాలు పాక్షికంగా విమాన రాకపోకలను నిలిపివేశాయి. దీంతో వేలాది మంది భారతీయులు గల్ఫ్ దేశాల్లోనే చిక్కుకుపోయారు.

**వందలాది విమానాలు రద్దు**

ప్రస్తుత పరిస్థితుల్లో ఇరాన్, ఇజ్రాయెల్‌తో పాటు ఇరాక్, సిరియా, ఖతర్, బహ్రెయిన్, కువైట్ తమ గగనతలాన్ని పూర్తిగా మూసివేశాయి. ఇక యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, జోర్డాన్ పాక్షికంగా విమాన సర్వీసులను నిలిపేశాయి. డ్రోన్లు, మిస్సైళ్ల దాడుల నేపథ్యంలో దుబాయ్, అబుదాబి, దోహా వంటి ప్రధాన నగరాల్లోని మిగతా 2లో..








# రాష్ట్రాలకు కేంద్రం అలర్ట్

- శాంతిభద్రతలు కట్టుదిట్టం
- అంతర్జాతీయ ఉద్రిక్తతలతో నిర్ణయం
- రాష్ట్రాలకు కేంద్ర హోం శాఖ లేఖలు
- ఫిబ్రవరి 28న విడుదల
- సీఎస్‌లు, డీజీలకు కీలక సూచనలు

డిడి9 వార్త, న్యూఢిల్లీ

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా అప్రమత్తత పెంచాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య మిగతా 2లో..

# భారత్-కెనడా సంబంధాలకు కొత్త దిశ

- వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతం
- 2030 నాటికి 50 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యం
- ద్వైపాక్షిక సంబంధాల్లో సరికొత్త అధ్యాయం
- కెనడా ప్రధాని మార్క్ కార్నీతో మోడీ భేటీ
- గ్లోబల్ బయోఫ్యూయల్ కూటమిలోకి కెనడా
- మార్క్ కార్నీ నిర్ణయాన్ని స్వాగతించిన మోడీ

డిడి9 వార్త, న్యూఢిల్లీ

భారత్, కెనడా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు కొత్తదశలోకి అడుగుపెట్టాయి. మార్క్ కార్నీ భారత పర్యటనలో భాగంగా సోమవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ భేటీలో ఇరు దేశాలు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. సమావేశం అనంతరం ఇద్దరు నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడి ముఖ్య అంశాలను వెల్లడించారు.

**గ్లోబల్ కూటముల్లో కెనడా చేరిక**

కెనడా ప్రభుత్వం గ్లోబల్ బయోఫ్యూయల్ కూటమి, అంతర్జాతీయ సౌరశక్తి కూటమిలో చేరాలని నిర్ణయించుకుంది. ఈ నిర్ణయాన్ని ప్రధాని మోదీ స్వాగతించారు. శుద్ధ ఇంధన రంగంలో రెండు దేశాలు కలిసి పనిచేయడం వల్ల ప్రపంచ వాతావరణ మిగతా 2లో..



# ముగిసిన డీసీసీ శిక్షణ శిబిరం



- చివరి రోజు ముఖ్య అతిథిగా రాహుల్ గాంధీ
- వికారాబాద్‌లో పీఏసీ సంయుక్త సమావేశం
- సీఎం రేవంత్ సహా తెలుగు రాష్ట్రాల పీసీసీ చీఫ్‌లు హాజరు
- డీసీసీ అధ్యక్షులకు రాహుల్ దిశానిర్దేశం
- రాజ్యసభ ఎన్నికలపై సుదీర్ఘ చర్చ కేంద్రంపై తీవ్ర విమర్శలు

డిడి9 వార్త, న్యూఢిల్లీ

లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సోమవారం తెలంగాణలో పర్యటించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీల రాజకీయ వ్యవహారాల కమిటీల (పీఏసీ) సంయుక్త సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వికారాబాద్‌లోని ఎస్ఏపీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఈ సమావేశం జరిగింది. పార్టీ బలోపేతం, రాబోయే రాజ్యసభ ఎన్నికల వ్యూహాలపై ప్రధానంగా చర్చించారు.

రాహుల్ గాంధీ ఉదయం శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనతో పాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉన్నారు. విమానాశ్రయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఇద్దరూ కలిసి మిగతా 3లో..

# గల్ఫ్‌ను కమ్మేసిన యుద్ధ మేఘాలు



**మొదటిపేజీ తరువాయి**

ఎయిర్‌పోర్టులు అత్యవసర సేవలకు మాత్రమే పరిమితమయ్యాయి. 1,000కిపైగా అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దు అయ్యాయి. రోజుకు సగటున 90 వేల మంది ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని విమానయాన వర్గాలు చెబుతున్నాయి.

**గల్ఫ్‌లో చిక్కుకున్న భారతీయులు**

ఈ పరిణామాలతో ఉద్యోగాల కోసం, వ్యాపారాల కోసం, విద్యాభ్యాసం కోసం, పర్యటనల కోసం వెళ్లిన వేలాది మంది భారతీయులు గల్ఫ్ దేశాల్లో ఇరుక్కుపోయారు. ముఖ్యంగా దుబాయ్, అబుదాబి, షార్జా, దోహా వంటి నగరాల్లో హోటళ్లలోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. విమానాలు ఎప్పుడు పునఃప్రారంభమవుతాయో స్పష్టత లేకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

**కర్ణాటక ముందడుగు**

గల్ఫ్‌లోని భారతీయుల భద్రత అంశాన్ని తొలుత కేంద్ర దృష్టికి తీసుకెళ్లిన రాష్ట్రాల్లో కర్ణాటక ఒకటి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షాలిని రజనీశ్ భారత విదేశాంగ శాఖ, పౌర విమానయాన శాఖలకు వివరమైన నివేదిక పంపించారు. గల్ఫ్ ప్రాంతంలోని పరిస్థితులు, అక్కడి భారతీయుల భద్రతపై ఉన్న ఆందోళనలను ప్రస్తావించారు. కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థను సక్రియం చేసింది. రాష్ట్ర అత్యవసర కార్యకలాపాల కేంద్రం ద్వారా 24 గంటల హెల్ప్‌లైన్ నడుస్తోంది. గల్ఫ్ దేశాల్లో ఉన్న కర్ణాటక వాసుల వివరాలను సేకరిస్తున్నారు.

**సుఖ్‌బీర్ సింగ్ బాదల్ విజ్ఞప్తి**

సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకు విజ్ఞప్తి చేశారు. "మిడిల్ ఈస్ట్‌లో పరిస్థితి తీవ్రంగా ఉంది. అక్కడ చిక్కుకున్న భారతీయులను వీలైనంత త్వరగా దేశానికి తీసుకురావాలి. విమాన మార్గాలు తెరుచుకున్న వెంటనే ప్రత్యేక ఎయిర్‌లిఫ్ట్ ఆపరేషన్ ప్రారంభించాలి" అని కోరారు.

**కేరళ ఘటన**

అజర్‌బైజాన్ నుంచి షార్జా మీదుగా కువైట్ వెళ్లాల్సిన ఓ విమానం అత్యవసరంగా కరాచీలో ల్యాండ్ అయింది. ఆ విమానంలో కేరళకు చెందిన ఒక కుటుంబం సహా ఎనిమిది మంది భారతీయులు ఉన్నట్లు సమాచారం. దీనిపై కేరళ ప్రభుత్వం విదేశాంగ శాఖతో సంప్రదింపులు జరిపింది. అవసరమైతే కొలంబో మార్గం ద్వారా వారిని భారత్‌కు తీసుకురావాలని సూచించింది.

**యూఏఈ అధ్యక్షుడితో మోదీ చర్చ**

మిడిల్ ఈస్ట్ పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ, షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్తో మాట్లాడారు. ఈ క్లిష్ట సమయంలో యూఏఈకు భారత్ సంఘీభావంగా నిలుస్తుందని తెలిపారు. దాడులను ఖండిస్తూ, ప్రాణనష్టానికి సంతాపం వ్యక్తం చేశారు. ప్రాంతీయ శాంతి, స్థిరత్వానికి భారత్ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు.

**కేంద్రం అత్యున్నత స్థాయి సమీక్ష**

ప్రధాని అధ్యక్షతన భద్రతా కేబినెట్ కమిటీ సమావేశమైంది. గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయుల భద్రతపై సమీక్ష జరిగింది. అవసరమైతే ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని, సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. వాణిజ్య కార్యకలాపాలు, ఇంధన సరఫరా, ప్రయాణికుల రాకపోకలపై ప్రభావాన్ని కూడా సమీక్షించారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ, "ప్రస్తుతం పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కానీ గల్ఫ్‌లో ఉన్న భారతీయులను సురక్షితంగా తీసుకురావడంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఉన్నత స్థాయిలో చర్చలు కొనసాగుతున్నాయి" అని తెలిపారు.

**దుబాయ్‌లో చిక్కుకున్న పర్యాటకుల వేదన**

రాజస్థాన్‌కు చెందిన నరేంద్ర ఖండేల్వాల్, నావల్ కిశోర్ గార్గ్ కుటుంబాలతో కలిసి దుబాయ్‌కు వెళ్లారు. మార్చి 1న భారత్‌కు తిరిగి రావాల్సి ఉండగా విమానాలు రద్దు అయ్యాయి. "హోటల్ ఖర్చులు పెరుగుతున్నాయి. బయటకు వెళ్లడానికీ భయంగా ఉంది. ప్రభుత్వం మాకు సహాయం చేయాలి" అని వారు కోరుతున్నారు. మహారాష్ట్రలోని ఠాణె నుంచి 23 మంది టూర్‌కు వెళ్లగా, వారిలో 12 మంది వృద్ధులు ఉన్నారు. విమాన సర్వీసులు రద్దు కావడంతో హోటళ్లలోనే ఉండాల్సి వచ్చింది. పుణెలోని ఇందిరా స్కూల్ ఆఫ్ బిజినెస్ స్టడీస్‌కు చెందిన 80 మంది ఎంబీఏ విద్యార్థులు, నలుగురు అధ్యాపకులు కూడా దుబాయ్‌లోనే నిలిచిపోయారు. వారిని సురక్షితంగా తీసుకురావాలని కళాశాల యాజమాన్యం కేంద్రాన్ని కోరింది. పంజాబ్‌లోని బటిండాకు చెందిన ఓ విద్యాసంస్థ ప్రిన్సిపల్ నీరు గార్గ్ మాట్లాడుతూ, "మా వద్ద దిర్హాం కరెన్సీ కూడా ముగిసింది. ఔషధాలు కొనలేని పరిస్థితి ఉంది. వెంటనే సహాయం కావాలి" అని విజ్ఞప్తి చేశారు.

**ముందున్న సవాళ్లు**

ప్రస్తుతం గల్ఫ్ ప్రాంతంలో సైనిక ఉద్రిక్తతలు తగ్గే సూచనలు కనిపించడంలేదు. గగనతలం ఎప్పుడు పూర్తిగా తెరుచుకుంటుందో స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో వేలాది మంది భారతీయులను సురక్షితంగా దేశానికి తీసుకురావడం కేంద్ర ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారింది. అయితే ప్రభుత్వం అన్ని మార్గాలపై చర్చలు జరుపుతోందని, అవసరమైతే ప్రత్యేక విమానాల ద్వారా ఎయిర్‌లిఫ్ట్ చేపడుతామని సంకేతాలు ఇస్తోంది. విదేశాంగ శాఖ హెల్ప్‌లైన్‌లు, రాయబార కార్యాలయాల ద్వారా భారతీయులతో నిరంతర సంబంధం కొనసాగిస్తోంది. గల్ఫ్ ప్రాంతంలోని తాజా పరిణామాలు భారతీయుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. పరిస్థితి సాధారణ స్థితికి చేరేవరకు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని ప్రభుత్వం సూచిస్తోంది.



# రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

వచ్చిందని పేర్కొన్నారు. అయినా వెనక్కి తగ్గకుండా ప్రజల కోసం నిలబడ్డానన్నారు.

**రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం**

దేశ రాజకీయ పరిస్థితులపై కూడా సీఎం స్పందించారు. ప్రస్తుతం దేశానికి మార్పు అవసరమని, అందుకోసం కాంగ్రెస్ పార్టీ బలపడాలని అన్నారు. రాహుల్ గాంధీని దేశ ప్రధానమంత్రిగా చూడడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త అదే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశం కోసం రాహుల్ గాంధీ నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. ఆయన సామాజిక న్యాయం, రైతుల హక్కులు, యువత ఉపాధి, మహిళల సాధికారత వంటి అంశాలపై నిరంతరం పోరాటం చేస్తున్నారని కొనియాడారు.

**తెలంగాణపై కాంగ్రెస్ పాత్ర**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో కాంగ్రెస్ పార్టీ పాత్రను సీఎం గుర్తు చేశారు. ముఖ్యంగా సోనియా గాంధీ తీసుకున్న నిర్ణయం వల్లే తెలంగాణ సాధ్యమైందని అన్నారు. ఆ త్యాగాన్ని ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆశలను నెరవేర్చే దిశగా పనిచేస్తోందన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సమర్థంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం తమ బాధ్యత అని చెప్పారు.

**పార్టీ బలోపేతంపై చర్చ**

పీఏసీ సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణంపై విస్తృత చర్చ జరిగింది. బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. ప్రజల సమస్యలపై చురుకుగా స్పందించాల్సిన అవసరం ఉందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ భవిష్యత్ కార్యాచరణ, రాబోయే ఎన్నికల వ్యూహంపై చర్చించినట్లు సమాచారం.

**కార్యకర్తలకు సందేశం**

సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రాజకీయాల్లో పదవులు శాశ్వతం కావని, కానీ ప్రజల నమ్మకం శాశ్వతమని అన్నారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రతి నాయకుడి కర్తవ్యమని చెప్పారు. ప్రజల మధ్య ఉండి, వారి సమస్యలకు పరిష్కారం చూపే నాయకత్వమే కాంగ్రెస్ ప్రత్యేకత అని వివరించారు. యువత, మహిళలు, రైతులు, కార్మికులతో పార్టీ అనుబంధాన్ని బలపరచాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పార్టీ కార్యక్రమాలు చురుకుగా నిర్వహించాలని చెప్పారు.

**ఉత్సాహంగా ముగిసిన సమావేశం**

రాహుల్ గాంధీ సమక్షంలో జరిగిన ఈ సమావేశం కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే దిశగా కాంగ్రెస్ ముందుకు సాగాలని



నాయకులు అభిప్రాయపడ్డారు. మొత్తానికి, సాధారణ స్థాయి నుంచి ముఖ్యమంత్రి పదవికి చేరుకున్న తన ప్రయాణాన్ని ఉదాహరణగా చూపిస్తూ సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలకు స్పష్టమైన లక్ష్యం నిర్దేశించారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయడమే తమ సంకల్పమని మరోసారి స్పష్టం చేశారు.

# భారత్—కెనడా సంబంధాలకు కొత్త దిశ

**మొదటిపేజీ తరువాయి**

లక్ష్యాల సాధనకు దోహదం అవుతుందని అన్నారు. క్లీన్ ఎనర్జీ రంగంలో ప్రత్యేక భాగస్వామ్యాన్ని ప్రారంభించేందుకు అంగీకరించారు. గాలి, సౌర, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లో సంయుక్త ప్రాజెక్టులు చేపట్టనున్నారు. 2050 నాటికి తన విద్యుత్ గ్రిడ్ సామర్థ్యాన్ని రెట్టింపు చేయాలన్న కెనడా లక్ష్యంలో భారత్ కీలక భాగస్వామిగా ఉండనుంది.

**వాణిజ్యానికి కొత్త లక్ష్యాలు**

భారత్-కెనడా ఆర్థిక సంబంధాలను తదుపరి స్థాయికి తీసుకెళ్లాలని ఇరు దేశాలు నిర్ణయించుకున్నాయి. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 50 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంను త్వరలోనే ఖరారు చేయాలని నిర్ణయించారు. కెనడియన్ పెన్షన్ ఫండ్స్ ఇప్పటికే భారత్‌లో భారీగా పెట్టుబడులు పెట్టిన విషయాన్ని మోదీ గుర్తు చేశారు. భారత వృద్ధిపై కెనడా పెట్టుబడిదారులు నమ్మకం ఉంచుతున్నారని తెలిపారు. రవాణా, మౌలిక వసతులు, పునరుత్పాదక శక్తి, సాంకేతిక రంగాల్లో మరింత పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు.

**రక్షణ, టెక్నాలజీ రంగాల్లో సహకారం**

రక్షణ రంగంలో సంబంధాలను బలోపేతం చేసేందుకు 'డిఫెన్స్ డైలాగ్' వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. భద్రతా అంశాలపై నియమితంగా చర్చలు జరపనున్నారు. కృత్రిమ మేధస్సు, అంతరిక్ష సాంకేతికత, సైబర్ సెక్యూరిటీ, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం రంగాల్లోనూ కొత్త ఒప్పందాలు కుదిరాయి. స్పేస్ టెక్నాలజీలో సంయుక్త పరిశోధనలకు అవకాశం కల్పించనున్నారు. శాటిలైట్ డేటా వినియోగం, భద్రతా రంగాల్లో సహకారం పెంచాలని నిర్ణయించారు. ఇరు దేశాల శాస్త్రవేత్తలు, పరిశోధకులు కలిసి పనిచేసే విధంగా మార్గరేఖలు సిద్ధం చేయనున్నారు.

**విద్యా, సాంస్కృతిక బంధాలు**

భారత్‌లో కెనడియన్ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లు స్థాపించేందుకు ఒప్పందం కుదిరింది. విద్యా రంగంలో విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు పెంచనున్నారు. ఇరు దేశాల్లోని ఆదివాసీ, గిరిజన వర్గాల సాంస్కృతిక వారసత్వాన్ని పంచుకునేందుకు అవగాహన ఒప్పందం కుదిరింది. సాంస్కృతిక పరమైన అనుబంధాలు ద్వైపాక్షిక సంబంధాలకు బలం చేకూరుస్తాయని నాయకులు అభిప్రాయపడ్డారు.

**భారత ఆర్థిక వ్యవస్థపై ప్రశంసలు**

మార్క్ కార్నీ మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థపై ప్రశంసలు కురిపించారు. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచిందన్నారు. భారతీ



యుల తలసరి ఆదాయం పెరుగుతున్న వేగం గణనీయమని పేర్కొన్నారు. 2023లో జరిగిన జీ20 సదస్సులో భారత్ ముందుకు తీసుకువచ్చిన 'వసుధైవ కుటుంబకం' భావన ప్రస్తుత ప్రపంచ సవాళ్లకు సరైన దిశను చూపిందని అన్నారు.గత ఏడాది కాలంలో భారత్, కెనడా ప్రభుత్వాల మధ్య జరిగిన చర్చలు గత రెండు దశాబ్దాల కంటే ఎక్కువగా ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఇది కేవలం సంబంధాల పునరుద్ధరణ మాత్రమే కాకుండా, కొత్త శకానికి నాంది అని అభివర్ణించారు.

**పశ్చిమాసియా పరిస్థితులపై ఆందోళన**

సమావేశంలో పశ్చిమాసియా పరిస్థితులపై కూడా చర్చ జరిగింది. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త రాష్ట్రాలు మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో శాంతి చర్చలే సరైన మార్గమని ప్రధాని మోదీ అన్నారు. యుద్ధం ఎలాంటి సమస్యకు పరిష్కారం కాదని స్పష్టం చేశారు. అంతర్జాతీయ వేదికలపై శాంతి స్థాపనకు భారత్ ఎప్పుడూ మద్దతు ఇస్తుందని తెలిపారు. విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తామని, అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రెండు ప్రజాస్వామ్య దేశాలు కలిసి మాట్లాడితే శాంతి సందేశం మరింత బలంగా వినిపిస్తుందని మోదీ పేర్కొన్నారు.

**ఉద్రిక్తతల నేపథ్యంలో వ్యాఖ్యలు ప్రాధాన్యం**

ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సైనిక చర్యల తరువాత పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగాయి. పలు ప్రాంతాల్లో దాడులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మోదీ చేసిన శాంతి పిలుపు అంతర్జాతీయ స్థాయిలో ప్రాధాన్యం సంతరించుకుంది.

**కొత్త దశలో భారత్—కెనడా సంబంధాలు**

మొత్తానికి ఈ భేటీతో భారత్-కెనడా సంబంధాలు మరింత బలోపేతం అయ్యాయి. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, శక్తి, సాంకేతికత, విద్యా రంగాల్లో విస్తృత సహకారం ప్రారంభమైంది. 2030 నాటికి వాణిజ్య లక్ష్యాన్ని చేరుకోవాలన్న సంకల్పంతో ఇరు దేశాలు ముందుకు సాగుతున్నాయి. భారత్-కెనడా సంబంధాలు ఇప్పుడు కేవలం ద్వైపాక్షిక ప్రయోజనాలకే పరిమితం కాకుండా, గ్లోబల్ శాంతి, స్థిరత్వం, పర్యావరణ పరిరక్షణ వంటి విస్తృత అంశాలపై కలిసి పనిచేసే దిశగా అడుగులు వేస్తున్నాయి. ఈ సమావేశం రెండు దేశాల మధ్య కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టినట్టే కనిపిస్తోంది.

# రాష్ట్రాలకు కేంద్రం అలర్ట్

**మొదటిపేజీ తరువాయి**

పెరుగుతున్న యుద్ధ వాతావరణం ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తుండగా, భారత్‌లో కూడా దాని ప్రభావం పడే అవకాశం ఉందని కేంద్రం భావిస్తోంది. ముఖ్యంగా సామాజిక, మత పరమైన ఉద్రిక్తతలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది.ఫిబ్రవరి 28న రాష్ట్రాల ముఖ్య కార్యదర్శులు, పోలీస్ డైరెక్టర్ జనరల్స్‌కు కేంద్ర హోంశాఖ లేఖ రాసింది. దేశంలో ఎక్కడా శాంతి భద్రతలకు భంగం కలగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించింది. విదేశీ పరిణామాలు దేశీయ పరిస్థితులపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ఇంటెలిజెన్స్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించింది.

మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో కొన్ని వర్గాలు భావోద్వేగాలకు లోనయ్యే అవకాశం ఉందని కేంద్రం పేర్కొంది. ముఖ్యంగా మతపరమైన సమావేశాలు, సభలు, పెద్ద ఎత్తున జరిగే ప్రజా కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని తెలిపింది. ఎవరైనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించింది. ప్రజల్లో విభేదాలు రేకెత్తించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేసింది.ఇటీవల అమెరికా సంయుక్త రాష్ట్రాలు చేపట్టిన సైనిక చర్యల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా చర్చలు ముదురుతున్నాయి. ఈ పరిణామాలు భారతదేశంలోనూ ప్రతిస్పందనలు కలిగించే అవకాశం ఉందని కేంద్రం అంచనా వేసింది. అందుకే సోషల్ మీడియా వేదికలపై పుకార్లు, తప్పుడు ప్రచారం, విద్వేషపూరిత పోస్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రాష్ట్రాలకు ఆదేశించింది. తప్పుడు సమాచారాన్ని వెంటనే గుర్తించి తొలగించడంతో పాటు, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొంది.

రాష్ట్ర పోలీస్ విభాగాలు, స్థానిక ఇంటెలిజెన్స్ యూనిట్లు, కేంద్ర ఏజెన్సీల మధ్య సమన్వయం మరింత పెరగాలని కేంద్రం సూచించింది. అనుమానాస్పద సమావేశాలు, గుంపుల కదలికలు, విదేశీ నిధుల ప్రవాహం వంటి అంశాలను జాగ్రత్తగా పరిశీలించాలని తెలిపింది. పరిస్థితి తీవ్రరూపం దాల్చే ముందు ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా అల్లర్లు, ఘర్షణలు నివారించవచ్చని అభిప్రాయపడింది.సున్నిత ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించాలని రాష్ట్రాలకు సూచనలు అందాయి. అత్యవసర పరిస్థితుల్లో స్పందించేందుకు కంట్రోల్ రూమ్‌లు సిద్ధంగా ఉంచాలని, 24 గంటల నిఘా వ్యవస్థను అమలు చేయాలని ఆదేశించింది. అవసరమైతే వేగంగా స్పందించే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని కూడా తెలిపింది.

విదేశాల్లో ఉన్న భారతీయుల భద్రతపై కూడా కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టింది. ముఖ్యంగా గల్ఫ్ దేశాల్లో పని చేస్తున్న లక్షలాది మంది భారతీయుల పరిస్థితిని సమీక్షిస్తోంది. అవసరమైతే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు దౌత్యపరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందని అధికారులు వెల్లడించారు. భారత రాయబార కార్యాలయాలతో నిరంతర సంబంధం కొనసాగిస్తున్నట్లు తెలిపారు.భారత్ ఈ విషయంలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఒకవైపు అంతర్జాతీయ వేదికలపై శాంతి, చర్చల ద్వారా సమస్యల పరిష్కారానికి మద్దతు తెలుపుతూనే, మరోవైపు దేశీయ భద్రతను కట్టుదిట్టం చేస్తోంది. ఎలాంటి విదేశీ ఉద్రిక్తతలు దేశంలో అంతర్గత సమస్యలకు దారితీయకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కూడా కేంద్రం పిలుపునిచ్చింది. నిర్ధారించని వార్తలను నమ్మవద్దని, సోషల్ మీడియాలో వచ్చిన ప్రతి సమాచారాన్ని పంచుకునే ముందు ధృవీకరించాలని సూచించింది. ప్రజల్లో భయం కలిగించే సందేశాలను ఫార్వర్డ్ చేయకుండా ఉండాలని కోరింది. ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపింది.రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కేంద్ర ఆదేశాల మేరకు చర్యలు ప్రారంభించాయి. ముఖ్య నగరాలు, మతపరమైనంగా సున్నితమైన ప్రాంతాల్లో అదనపు నిఘా ఏర్పాటు చేస్తున్నారు. ఇంటెలిజెన్స్ వర్గాలు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాయి. జిల్లా స్థాయిలో శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యపరుస్తున్నారు.

పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, విద్వేష ప్రసంగాలు, సోషల్ మీడియా దుష్ప్రచారంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపశమనం ఉండదని స్పష్టం చేశారు. శాంతి భద్రతలను కాపాడడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.నిపుణుల అభిప్రాయం ప్రకారం, అంతర్జాతీయ ఉద్రిక్తతలు పెరిగినప్పుడు దేశీయ స్థాయిలో భావోద్వేగాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతుంటాయి. అలాంటి పరిస్థితుల్లో ముందస్తు చర్యలు తీసుకోవడం చాలా అవసరం. కేంద్రం ఇచ్చిన సూచనలు అదే దిశగా ఉన్నాయని వారు అంటున్నారు.

మొత్తంగా చూస్తే, మధ్యప్రాచ్య పరిణామాలపై భారత్ అత్యంత జాగ్రత్తగా స్పందిస్తోంది. దేశంలో ఎక్కడా సామాజిక ఐక్యతకు భంగం కలగకుండా చర్యలు తీసుకుంటోంది. ప్రజల భద్రతే ముఖ్యమని, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు కొనసాగిస్తామని కేంద్రం స్పష్టం చేసింది. దేశంలో శాంతి, సామరస్య వాతావరణం కొనసాగేందుకు ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా అప్రమత్తంగా ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రజలు కూడా సహకరించాలని, పుకార్లకు లోనుకాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# మైనింగ్ ఈ-వేలంలో భారీ అక్రమాలు

**మొదటిపేజీ తరువాయి**

రాశారు. గనుల శాఖ చేపట్టిన ఈ వేలం ప్రక్రియ పారదర్శకతకు విరుద్ధంగా సాగిందని ఆయన విమర్శించారు. గనుల శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో చేపట్టిన ఈ వేలం ప్రక్రియలో విధానపరమైన లోపాలు, చట్ట ఉల్లంఘనలు, పారదర్శకత లోపాలు ఉన్నట్లు పేర్కొన్నారు. పసుపులబోడు, సైదుల్నామా, సుల్తాన్‌పూర్ మైనింగ్ బ్లాక్‌లలో సుమారు 1,100 ఎకరాల రిజర్వ్డ్ ఫారెస్ట్ భూమి ఉన్నప్పటికీ, టెండర్ పత్రాల్లో చట్టబద్ధంగా అవసరమైన కీలక వివరాలు పొందుపరచలేదని ఆరోపించారు. మినరల్ బ్లాక్‌ల ఖచ్చితమైన అక్షాంశ రేఖాంశ కోఆర్డినేట్లు, అటవీ కంపార్ట్‌మెంట్ వివరాలు, డీజీపీఎస్ సర్వే ధృవీకరణ, వివరణాత్మక సర్వే మ్యాపులు, యూటీఎం జియో కోఆర్డినేట్లు, అలాగే మినరల్ ఆక్షన్ రూల్స్, 2015, మైన్స్ అండ్ మినరల్స్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్, 1957 ప్రకారం అవసరమైన సమగ్ర జియోలాజికల్ నివేదికలు వెల్లడించలేదని లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి లోపాలు వేలం ప్రక్రియ యొక్క చట్టబద్ధతను, పారదర్శకతను తీవ్రంగా దెబ్బతీస్తాయన్నారు. టెండర్ నోటీస్ జారీకి ముందే మినరల్ బ్లాక్‌లను ఖచ్చితంగా గుర్తించి పూర్తి వివరాలు వెల్లడించడం తప్పనిసరి అయినప్పటికీ, ఈ నిబంధనలు పాటించలేదని విమర్శించారు.

**నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ లేకుండానే వేలం!**

ఈ అక్రమ టెండర్లపై మరింత ఆందోళన కలిగించే అంశాలను కూడా లేఖలో ప్రస్తావించారు. న్యాయపరమైన విచారణలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ వేలాన్ని ముందుకు తీసుకెళ్లడం, తెలంగాణ హైకోర్టు డబ్ల్యూపీ(పీఐఎల్) నెంబర్.21 ఆఫ్ 2024లో ఇచ్చిన సూచనలను పట్టించుకోకపోవడం, చట్టపరమైన, పర్యావరణ అనుమతులు పూర్తికాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్లను ప్రకటించడం వంటి అంశాలు తీవ్ర అనుమానాలకు తావిస్తున్నాయన్నారు. సైదుల్నామా బ్లాక్‌కు దెక్కన్ సిమెంట్స్ లిమిటెడ్, సుల్తాన్‌పూర్ బ్లాక్‌కు ఎన్సీఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థలను ప్రిఫర్డ్ బిడ్డర్లుగా ప్రకటించారని, ఈ సంస్థలు రిజర్వ్డ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ కేసులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. మైన్స్ అండ్ జియోలజీ శాఖ లీగల్ ఆఫీసర్ ఈ బ్లాక్‌ల సమాచారాన్ని గోప్యంగా పేర్కొంటూ ఫిర్యాదుదారుడికి ఇవ్వడానికి నిరాకరించడం పారదర్శకతపై అనుమానాలు పెంచుతోందన్నారు. అటవీ శాఖ నుంచి తప్పనిసరిగా పొందాల్సిన నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ లేకుండానే వేలం నిర్వహించినట్లు ఆరోపణలు ఉన్నాయని, రిజర్వ్డ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో నిబంధనలు పాటించకుండా మైనింగ్ జరగడం పర్యావరణానికి ముప్పు కలిగించడమే కాకుండా ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు.

**టెండర్ ప్రక్రియను రద్దు చేయాలి**

వేలం ప్రక్రియకు సంబంధించిన అన్ని చర్యలను తక్షణమే నిలిపివేయాలని, నోటిఫికేషన్ నెం. 2263906/DM&G MI/Lst/2023 కింద చేపట్టిన టెండర్ ప్రక్రియను రద్దు చేయాలని, స్వతంత్ర, పారదర్శక విచారణను నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని, అవసరమైన శాస్త్రీయ సర్వేలు, జియోలాజికల్ డేటా వెల్లడి, అటవీ అనుమతులు పొందిన తర్వాత మాత్రమే చట్టబద్ధంగా కొత్త టెండర్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సీఎస్‌కు కూడా పంపారు.

# ముగిసిన డీసీసీ శిక్షణ శిబిరం

**మొదటిపేజీ తరువాయి**

వికారాబాద్‌కు వెళ్లారు.వికారాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తదితరులు రాహుల్‌కు స్వాగతం చెప్పారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు.

**రాజ్యసభ ఎన్నికలపై చర్చ**

ఈ నెల 16న తెలంగాణలో రెండు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల దాఖలుకు 5వ తేదీ చివరి గడువు. ఈ నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై రాష్ట్ర నాయకత్వంతో రాహుల్ గాంధీ చర్చించినట్లు సమాచారం.ప్రస్తుతం రాజ్యసభ సభ్యులుగా ఉన్న అభిషేక్ మను సింఘ్వీ, కేఆర్ సురేశ్ రెడ్డి పదవీకాలం ఏప్రిల్ 9తో ముగియనుంది. కాంగ్రెస్ పార్టీకి అసెంబ్లీలో స్పష్టమైన మెజారిటీ ఉండటంతో రెండు స్థానాలూ గెలుచుకునే అవకాశం ఉంది. సింఘ్వీని మళ్లీ నామినేట్ చేసే అవకాశాలు ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అభ్యర్థులపై అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుంది.టికెట్ కోసం పలువురు సీనియర్ నేతలు ఆసక్తి చూపుతున్నారు. శ్యామ్ మోహన్ అనంతుల, వి. హనుమంతరావు, జి. చిన్నారెడ్డి, మధు యాష్కీ గౌడ్, ఎం. కోదండరెడ్డి తదితరుల పేర్లు చర్చలో ఉన్నట్లు సమాచారం.

**డీసీసీ అధ్యక్షులకు దిశానిర్దేశం**

పీఏసీ సమావేశం అనంతరం రాహుల్ గాంధీ అనంతగిరి హిల్స్‌లోని హరిత రిసార్ట్‌కు వెళ్లారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన నూతన డీసీసీ అధ్యక్షుల కోసం నిర్వహించిన 10 రోజుల శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయాలని ఆయన సూచించారు. గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీని చురుకుగా ఉంచాలని, ప్రజా సమస్యలపై నేరుగా స్పందించాలని ఆయన కోరారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం డీసీసీ అధ్యక్షుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.

**కేంద్రంపై విమర్శలు**

సమావేశంలో దేశ రాజకీయ పరిస్థితులపై కూడా రాహుల్ గాంధీ మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ తీసుకుంటున్న నిర్ణయాలు దేశానికి హానికరమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను కాంగ్రెస్ కార్యకర్తలు బహిర్గతం చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు. దేశంలో యుద్ధ వాతావరణం నెలకొనేలా పరిస్థితులు తయారవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విదేశాంగ విధానాలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇండో-అమెరికన్ ట్రేడ్ ఒప్పందంపై కూడా ఆయన విమర్శలు చేశారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని కేంద్రానికి సూచించారు.

**స్పీకర్ గడ్డం ప్రసాద్ హాజరు**

పీఏసీ సమావేశ ప్రాంగణానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కూడా వచ్చారు. అయితే తాను స్పీకర్ హోదాలో కాకుండా స్థానిక ఎమ్మెల్యేగా రాహుల్‌ను కలిసేందుకు వచ్చినట్లు తెలిపారు. ప్రోటోకాల్ ప్రకారం సమావేశమయ్యానని చెప్పారు.

**సంస్థాగత బలోపేతమే లక్ష్యం**

మొత్తానికి రాహుల్ గాంధీ పర్యటనలో పార్టీ సంస్థాగత బలోపేతం, రాజ్యసభ ఎన్నికల వ్యూహం, కేంద్ర ప్రభుత్వంపై రాజకీయ దాడి ప్రధాన అంశాలుగా నిలిచాయి. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను మరింత బలపరచేందుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలుస్తోంది. రాబోయే రోజుల్లో అభ్యర్థుల ప్రకటన, పార్టీ కార్యాచరణపై స్పష్టత రానుంది. రాహుల్ గాంధీ పర్యటనతో తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త ఉత్సాహం కనిపించిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



# కాంగ్రెస్ అసలు రంగు పూర్తిగా బయటపడింది

**మొదటిపేజీ తరువాయి**

విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలనే డిమాండ్‌తో బీజేపీ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద సోమవారం నిరాహార దీక్ష చేపట్టింది. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ నేతలు గడ్డపార, పారలు పెట్టుకుని బయలుదేరారని సెటైర్లు వేశారు. డిక్లరేషన్ పేరుతో అన్ని వర్గాలను మోసం చేసిన రాహుల్ గాంధీ తెలంగాణలో ఎలా పర్యటిస్తారని ప్రశ్నించారు. నేషనల్ హెరాల్డ్ కోసం రూ.వెయ్యి కోట్లు గాంధీ కుటుంబానికి ఇచ్చేందుకు సిద్ధమని చెబుతున్నారని, కానీ హామీలు నెరవేర్చేందుకు మాత్రం నిధులు లేవా అని ప్రశ్నించారు. ఈ పరిస్థితి ఇలాగే ఉంటే ప్రజల కోపానికి దహించుకుపోవడం ఖాయమని హెచ్చరించారు. కాంగ్రెస్ హయాంలో కమీషన్ల పాలన సాగుతున్నదని ఆరోపించారు. రిటైర్డ్ ఉద్యోగులు తలుచుకుంటే ప్రభుత్వం ఒక్కరోజు కూడా నడవదని వార్నింగ్ ఇచ్చారు. టీజీఎస్పీఎస్సీని ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యోగుల కుటుంబాల్లో విషాదం నెలకొన్నదని, ప్రభుత్వం మారినా ప్రజల పరిస్థితి మారలేదన్నారు. విశ్రాంత ఉద్యోగులకు వారికి ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. చెల్లించకుంటే ఈ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డట్టేనని పేర్కొన్నారు.

**బెనిఫిట్స్ కోసం ధర్నా చేయాల్సిన దుస్థితి..**

గతంలో రిటైర్మెంట్ ఉద్యోగులను ఘనంగా సాగనంపేవారని, కానీ నేడు బెనిఫిట్స్ కోసం ధర్నా చేయాల్సిన దుస్థితి వచ్చిందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. రాష్ట్రంలో ఇంత సిగ్గు మాలిన వ్యవస్థ ఉంటుందని భావించలేదన్నారు. కష్టపడి తెచ్చుకున్న తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ కన్నీరు పెట్టిస్తుందని అనుకోలేదన్నారు. భూములను భూ బకాసురులు, బ్రోకర్లు, బడా కంపెనీల కోసం అమ్ముతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజల శ్రమ, డబ్బు ఢిల్లీకి పోతుండటం బాధగా అనిపిస్తున్నదన్నారు. బ్యూరోక్రాట్స్ పరిస్థితి ఇంత దీనంగా ఉంటుందని భావించలేదని, పొలిటికల్ లీడర్లు ఫోన్ చేస్తే తమ చేతిలో ఏం లేదని చెప్పడానికి సిగ్గుండాలని ఫైరయ్యారు. ఇప్పుడు దీక్ష చేసి పోతామని, కానీ భవిష్యత్‌లో పోరాటాలకు సిద్ధమవుతామన్నారు.

**పొయ్యిలో నుంచి పెనం మీద పడినట్లు..**

పొయ్యిలో నుంచి పెనం మీద పడినట్లు రాష్ట్ర ప్రజలు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల పరిస్థితి దాపురించిందని ఎంపీ డీకే అరుణ మండిపడ్డారు. అధికారంలోకి రావడానికి ముందు మాయమాటలు చెప్పిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక తెలంగాణ ప్రజలను మోసం చేసిందని ఫైరయ్యారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగ కుటుంబాల్లో ఈ ప్రభుత్వం తీవ్ర అశాంతిని నింపిందన్నారు. వైద్య అవసరాలకు, కుటుంబ అవసరాలకు డబ్బులు లేక తీవ్ర మానసిక వేదనకు గురై ఇప్పటికే సుమారు 70 మంది ప్రాణాలు కోల్పోయిన పరిస్థితికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

**పంతుళ్లతో పంచాయితీ**
**పెట్టుకొని మళ్లీ గెలవలేదు**

పంతుళ్లతో పంచాయితీ పెట్టుకుని, గోక్కున్న ఒక్క సర్కారూ మళ్లీ గెలవలేదని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఆకునూరి మురళి ఇచ్చిన ఏకసభ్య కమిషన్ రిపోర్ట్ అమలు చేస్తే ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. పార్లమెంట్‌లో ఏం మాట్లాడాలో తెలియని పప్పుతో శిక్షణ తరగతులు నిర్వహించి ఏం ఉపయోగమని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఎన్నికల ముందు ఇచ్చిన మాటలు ఒకసారి గుర్తు చేసుకోవాలని చురకలంటించారు. సీక్రెట్‌గా బిర్యానీ తినే రాహుల్ గాంధీ.. అశోక్ నగర్ స్టడీ సర్కిల్ దగ్గర సెక్యూరిటీ లేకుండా ఐదుగురితో



మాట్లాడితే చాలని.. వాస్తవాలు తెలుస్తాయన్నారు.

**పదవీ విరమణ చేసి ఏడాది**
**గడిచినా నో బెనిఫిట్స్**

రాష్ట్రంలో ఉద్యోగులు పదవీ విరమణ చేసి ఏడాది గడిచినా బెనిఫిట్స్ అందించలేదని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. రిటైర్డ్ ఉద్యోగులు చనిపోతున్నా వారి బెనిఫిట్స్ ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంట్రాక్టర్లకు కమీషన్ల కోసం రూ.కోట్లు విడుదల చేస్తున్న కాంగ్రెస్‌కు రిటైర్డ్ ఉద్యోగులు గుర్తు రావడం లేదా? అని ఏలేటి ప్రశ్నించారు. అనంతరం ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం వృద్ధులను కూడా వదల్లేదని, మోసం చేయడం కాంగ్రెస్ లక్షణమన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయించిన ఉద్యోగులు ఇప్పుడు ధర్నాలు చేస్తే ఏం లాభమని ప్రశ్నించారు. అన్ని వర్గాల ప్రజలు ఇప్పుడు తమ వద్దకు వస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో అయినా బీజేపీకి ఓటేసి ప్రాణం పోయాలని రాకేశ్ రెడ్డి కోరారు. వారి సమస్యలు పరిష్కరించి ఈ ధర్నా చౌక్‌లోనే సంతకాలు పెడతానని పేర్కొన్నారు.

**ఉద్యోగులు ఆందోళన పడొద్దు**

ప్రభుత్వం తొలి ప్రాధాన్యతగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని ఎమ్మెల్సీ మల్క కొమురయ్య డిమాండ్ చేశారు. ఉద్యోగులెవరూ ఆందోళన పడొద్దని, వారికి న్యాయం జరిగే వరకు తాము అండగా ఉంటామని భరోసానిచ్చారు. పబ్లిక్‌ను నమ్మించి కాంగ్రెస్ పవర్‌లోకి వచ్చిందని, రెండేళ్లయినా ఏ ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. రిటైర్మెంట్ ఫండ్స్‌ని ఇతర ప్రయోజనాలకు ప్రభుత్వం డైవర్ట్ చేస్తున్నదన్నారు. ఉద్యోగుల సొమ్మును ఇతర ప్రయోజనాలకు మళ్లించడం చట్ట రీత్యా నేరమన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు లేవని, ఒక్క తెలంగాణలోనే ఎందుకిలా అవుతున్నదని నిలదీశారు. అనంతరం ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ, పెన్షన్ అందక ప్రతినెలా రూ.వంద కోట్లు పెండింగ్‌లో పడుతున్నదన్నారు. అయినా ప్రభుత్వం తీరు దున్నపోతుపై వాన పడినట్లు ఉందని చురకలంటించారు. క్రమంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పోతున్నదన్నారు. రూ.10 వేల కోట్లు తెచ్చి విశ్రాంత ఉద్యోగుల బెనిఫిట్స్ అందించాలన్నారు.



# ప్రజావాణి కార్యక్రమానికి 113 దరఖాస్తులు

**కామారెడ్డి, మార్చి 02(డిడి9 వార్త):**

ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో వీణ, జడ్పీ సీఈఓ చందర్లతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 113 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. భూ సమస్యలు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు తదితర అంశాలపై అర్జీలు స్వీకరించినట్లు వెల్లడించారు.సంబంధిత శాఖల అధికారులు అర్జీదారుల సమస్యలను క్షుప్తంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. తహసీల్దార్లు, జిల్లా స్థాయి అధికారులు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని సూచించారు.



# త్వరలో యూనిఫాం ట్యాక్స్ సిస్టమ్

- మూడు కార్పొరేషన్లలో ఒకే విధానం అమలు యోచన
- రెండు ట్యాక్స్ విధానాలపై అధికారుల అధ్యయనం
- విలీన ప్రాంతాల్లో మార్కెట్ వ్యాల్యూ ప్రకారం..
- జీహెచ్ఎంసీ పాత పరిధిలో రెంటల్ విధానం
- కొత్త ఆర్థిక సంవత్సరంలో ఒకే పన్ను విధానం
- ఏప్రిల్ తర్వాత సర్కార్ తుది నిర్ణయం




**డిడి9 వార్త, హైదరాబాద్**

కోర్ అర్బన్ రీజియన్ ప్రజలకు అత్యవసర, పౌర సేవలందిస్తున్న మూడు కార్పొరేషన్ల పరిధిలో ఒకే ప్రాపర్టీ ట్యాక్స్ యూనిఫామ్ విధానాన్ని అమలు చేసే దిశగా అధికార యంత్రాంగం అధ్యయనం చేస్తున్నది. ఇటీవలే పునర్ వ్యవస్థీకరించిన జీహెచ్ఎంసీ పరిధిలోని పాత ప్రాంతాల్లో రెంటల్ ఆధారిత ప్రాపర్టీ ట్యాక్స్ విధానాన్ని అమలు చేస్తున్నది. విలీన పట్టణ స్థానిక సంస్థల పరిధిలో రిజిస్ట్రేషన్ మార్కెట్ వ్యాల్యుయేషన్ ప్రకారం ప్రాపర్టీ ట్యాక్స్‌ను అమలు చేస్తున్నారు. దీంతో మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని పాత పరిధుల్లో ఒక విధానం, విలీన పట్టణ స్థానిక సంస్థల్లో మరో విధానం అమలవుతున్నది. గతేడాది నవంబర్ 25వ తేదీన కోర్ అర్బన్ రీజియన్‌లోని 27 పట్టణ స్థానిక సంస్థల విలీనం ఆదేశాలకు సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆ తర్వాత ఆయా స్థానిక సంస్థల్లోని ఆస్తులు, ఆదాయాన్ని స్వాధీనం చేసుకునే క్రమంలో అధికారులు పట్టణ స్థానిక సంస్థల్లో రిజిస్ట్రేషన్ మార్కెట్ వ్యాల్యూ ఆధారిత ప్రాపర్టీ ట్యాక్స్ విధానం అమలవుతున్నట్లు గుర్తించారు. అప్పటి వరకు జీహెచ్ఎంసీ పాత పరిధిలోని 30 సర్కిళ్లలో మొత్తం 19.50 లక్షల ప్రాపర్టీ ట్యాక్స్ ఇండెక్స్ నెంబర్లు (పీటీఐఎన్) ఖాతాలుండేవి. పట్టణ స్థానిక సంస్థల విలీనం కావడంతో వాటిలోని దాదాపు మూడున్నర లక్షల నుంచి నాలుగు లక్షల వరకున్న పీటీఐఎన్‌లను జీహెచ్ఎంసీలోకి విలీనం చేయడంతో మొత్తం పీటీఐఎన్ నెంబర్ల సంఖ్య సుమారు 23 లక్షల పై చిలుకు పెరిగాయి. విలీన ప్రాంతాల్లోనూ పాత మార్కెట్ వ్యాల్యుయేషన్ ప్రకారమే ఆస్తి పన్ను వసూలు చేస్తూ వచ్చారు. ఆ తర్వాత మూడు కార్పొరేషన్లుగా విడిపోయిన తర్వాత 150 వార్డులు, 858 కిలోమీటర్ల విస్తీర్ణంతో ఏర్పడిన జీహెచ్ఎంసీ పరిధిలోని సుమారు 23 లక్షల పై చిలుకు పీటీఐఎన్ నెంబర్లలో జీహెచ్ఎంసీకి సుమారు 11 లక్షల పీటీఐఎన్ నెంబర్లు పునర్ వ్యవస్థీకరణలో భాగంగా కేటాయించారు. మిగిలిన 12 లక్షల పై చిలుకు పీటీఐఎన్ నెంబర్లను సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లకు కేటాయించారు. మూడు వేర్వేరుగా కార్పొరేషన్లుగా, వెర్వేరు టార్గెట్లతో ప్రస్తుతం ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్ జరుగుతున్నా, మూడు కార్పొరేషన్లలో పెద్దన్న పాత్ర పోషిస్తున్న జీహెచ్ఎంసీ ఖాతాలోనే ట్యాక్స్ చెల్లింపులు జమ అవుతున్నాయి. మూడు కార్పొరేషన్లలోనూ కొన్ని ఆస్తుల నుంచి రెంటల్ ఆధారిత ప్రాపర్టీ ట్యాక్స్ విధానం, మరి కొన్నింటిలో మార్కెట్ వ్యాల్యుయేషన్ విధానాలు అమలవుతున్నాయన్న విషయాన్ని జీహెచ్ఎంసీ అధికారులు సర్కార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వర్తమాన ఆర్థిక సంవత్సరం (202526) చివరి కల్లా ఇదే విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం. దీనికి సమాంతరంగా ఈ రెండు ట్యాక్స్ సిస్టమ్‌లలో జీహెచ్ఎంసీకి, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల వారీగా ఏ కార్పొరేషన్‌కు ఏ విధానం వర్తిస్తుందన్న విషయంపై అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. అధికారులు ఎన్ని సిఫార్సులు చేసినా, పన్ను వర్తింపు, వసూళ్లకు అనుసరించాల్సిన విధానంపై సర్కారుదే తుది నిర్ణయమని తెలిసింది.

**కొత్త విధానాన్ని అమలు చేస్తే...**

జీహెచ్ఎంసీలోకి విలీనమైన పట్టణ స్థానిక సంస్థల ప్రాపర్టీ ట్యాక్స్ ప్రస్తుతం మార్కెట్ వ్యాల్యుయేషన్ ప్రకారం వసూలు చేస్తుండగా, ఆ విధానం అక్కడ ప్రాపర్టీ యజమానులకు భరించదగ్గ విషయంగా మారి, దీనిపై పెద్దగా అభ్యంతరాలేమీ లేవు. కానీ, పాత జీహెచ్ఎంసీ పరిధిలో అమలు చేస్తున్న రెంటల్ వ్యాల్యు విధానాన్ని మూడు కార్పొరేషన్లలో యూనిఫామ్‌గా అమలు చేస్తే ఎలాంటి పరిణామాలెదురవుతాయి? ట్యాక్స్ చెల్లింపు దారిపై ఎలాంటి భారం పడుతుందన్న విషయాన్ని కూడా అధికారులు అధ్యయనం చేస్తున్నట్లు సమాచారం. విలీన ప్రాంతాల్లోని రిజిస్ట్రేషన్ మార్కెట్ వ్యాల్యుయేషన్ విధానాన్ని ఒక వేళ మూడు కార్పొరేషన్ల పరిధిలో అమలు చేస్తే కోర్ సిటీ ఆస్తుల యజమానులపై పన్ను భారం పెరిగే అవకాశమున్నది. అదే రెంటల్ వ్యాల్యూ ప్రకారం ప్రస్తుతం కోర్ సిటీలో అమలు చేస్తున్న విధానాన్ని మూడు కార్పొరేషన్లలో యూనిఫామ్‌గా అమలు చేస్తే విలీన ప్రాంతాల ప్రాపర్టీల యజమానులకు ట్యాక్స్ భారీగా తగ్గే అవకాశం ఉన్నందున కొత్త ఆర్థిక సంవత్సరంలో మూడు కార్పొరేషన్లలో సర్కార్ ఎలాంటి యూనిఫైడ్ ట్యాక్స్ సిస్టమ్‌ను అమల్లోకి తేనుందన్న విషయం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.



# శాసనసభ సభాపతి పదవికి వన్నె తెచ్చిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు

- శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి, మార్చి 02(డిడి9 వార్త):**

దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా జిల్లా యువజన & క్రీడా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, శాసనసభ స్పీకర్ పదవికి వన్నె తెచ్చిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని అభివర్ణించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా పనిచేసిన ఆయన ప్రజాస్వామ్య విలువలను కాపాడడంలో విశిష్ట పాత్ర పోషించారని తెలిపారు. ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతిని నిర్వహించడం గౌరవకరమైన విషయమని పేర్కొన్నారు. 1935 మార్చి 2న జయశంకర్ భూపాలపల్లి జిల్లా ధన్వాడ గ్రామంలో జన్మించిన శ్రీపాదరావు స్వగ్రామంలో ప్రాథమిక విద్యను పూర్తి చేసి, మంథనిలో ఉన్నత విద్యను అభ్యసించారు. అనంతరం హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్, బీఎస్సీ, ఆర్ట్స్, లా విద్యలను అభ్యసించారు. విద్యార్థి దశ నుంచే ప్రజాసేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని నాయకత్వ లక్షణాలను ప్రదర్శించారు.తెలంగాణ ప్రాంతానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడైన ఆయన ధన్వాడ గ్రామ సర్పంచ్‌గా పలు మార్లు సేవలందించారు. 1980లలో మరియు 1990ల ప్రారంభంలో మంథని నియోజకవర్గం నుండి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజల విశ్వాసాన్ని పొందారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించి విశిష్ట సేవలందించారు. స్పీకర్‌గా ఆయన నిష్పాక్షికత, క్రమశిక్షణ, ప్రజాస్వామ్య విలువల పట్ల అంకితభావంతో సభా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించారు. పార్టీలకు అతీతంగా గౌరవం పొందిన నాయకుడిగా గుర్తింపు పొందారు. సభ గౌరవాన్ని కాపాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించారు.గ్రామాభివృద్ధి, బలహీన వర్గాల సంక్షేమం, ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన కృషి విశేషమైనదని, సరళత, సమగ్రత, నిబద్ధత ఆయన వ్యక్తిత్వ లక్షణాలుగా నిలిచాయని కలెక్టర్ పేర్కొన్నారు. 1999 ఏప్రిల్ 13న కరీంనగర్ జిల్లా అన్నారం గ్రామ సమీపంలో దుర్మరణం చెందిన ఆయన సేవలు, ప్రజాస్వామ్య పరిరక్షణలో చూపిన అంకితభావం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్, ఆర్డీఓ వీణ, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈఓ చందర్, జిల్లా అధికారులు, టీజీఓ, టీఎన్జీఓల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## బీర్కూర్ గ్రామంలో కల్యాణ లక్ష్మి చెక్కు పంపిణీ

**బీర్కూర్,మర్చి 02(డిడి9 వార్త):**

బీర్కూర్ కు చెందిన కొత్తపల్లి గంగామణికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి పథకం కింద రూ. 1,00,116 విలువైన చెక్కును సోమవారం రెవెన్యూ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని గంగామణికి అభినందనలు తెలిపారు. ఉప సర్పంచ్ పరమేష్ పంతులు, యువజన నాయకులు మియాపురం శశికాంత్, వార్డు సభ్యులు రఘు, మహేష్, ఆనంద్, భాస్కర్, మద్నూర్ శంకర్, మెంటే మధు, అశోక్, పవన్, సత్యకిరణ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.ప్రభుత్వం ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నదని వారు పేర్కొన్నారు.



## వ్యక్తిత్వ వికాస కార్యక్రమం



**wఆదిలాబాద్ జిల్లా, 02మార్చ్ (డి డి 9)**

వివేకానంద పాఠశాల,సోనాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస కార్యక్రమంను ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా మోటివేషనల్ స్పీకర్స్ బద్దం పురుషోత్తం రెడ్డి,గొడిసెల రమణ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల జ్ఞాపకశక్తిని పెంచుకోవడానికి, చేతివ్రాత మెరుగుపరచుకోవడం,అభ్యసన వాయిదా వేయకుండా ఉండడం, మూర్తిమత్వం,విద్యార్థుల క్రమశిక్షణ,బాల్యం నుండి లక్ష్యాన్ని నిర్దేశించుకుంటే తప్పనిసరిగా అది విద్యార్థులను లక్ష సాధన దిశగా ముందుకు తీసుకెల్తుంది.మరియు నవోదయ,గురుకుల,సైనిక పాఠశాల ప్రవేశ పరీక్షల గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్స్ బద్దం పురుషోత్తం రెడ్డి, గొడిసెల రమణా గౌడ్, డైరెక్టర్స్ కోస్మెట్ శుద్ధోధన్,మునిగెల శ్రీధర్, ఉపాధ్యాయ బృందము,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు...



## ముందస్తు హోలీ వేడుకలు

**బజార్ హత్నూర్, మార్చి 2 (డిడి9న్యూస్ ):-**

బజార్ హత్నూర్ మండలం లోని న్యూ అనంతపూర్ గ్రామంలో సోమవారం రోజు ఉదయం ఆ ఊరి గిరిజనులు సంప్రదాయం ప్రకారం ముందస్తు హోలీ పండుగను జరుపు కున్నారు.కుడుకల పేర్లు (హారాంలు), చక్కర బిళ్ళలతో తయారు చేసిన హారాలు పాసంగాలు చేసి పంచుకున్నారు. పిల్లలకు హారాలు పంచి పెట్టారు.సాయంత్రం హోలీక దహనం కార్యక్రమం నిర్వహించారు.



## శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయం:అదనపు డీసీపీ బస్వారెడ్డి

**నిజామాబాద్ జిల్లా, 02 మార్చి(డీడీ9 వార్త) :**

మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను నిజామాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు అదనపు డీసీపీ (అడ్మిన్) జి.బస్వారెడ్డి ఆధ్వర్యంలో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బస్వారెడ్డి మాట్లాడుతూ... శ్రీపాదరావు సౌమ్య మనస్తత్వం గల నాయకుడని, నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి కష్టనష్టాల్లో పాలు పంచుకున్న ప్రజా నాయకుడని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా ఆయన చూపిన నిజాయితీ, నిరాడంబరత నేటికీ ఆదర్శప్రాయమని, రాష్ట్ర అభివృద్ధిలో ఆయన చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్లు శంకర్, బషీర్, శ్రీనివాస్‌లతో పాటు పీసీఆర్ సీఐ వీరయ్య, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సతీష్, సీఎస్‌బీ, ఐటీ కోర్, సెంట్రల్ కంప్లైంట్ సెల్, సీసీఆర్‌బీ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.



# జిల్లాలో ఆహార భద్రతపై కఠిన చర్యలు

- **కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఫుడ్ సేఫ్టీ కమిటీ సమావేశం**

**కామారెడ్డి, మర్చి 02(డిడి9 వార్త):**







జిల్లాలో ఆహార భద్రతా ప్రమాణాల అమలు, విద్యాసంస్థల్లో నాణ్యమైన భోజన సరఫరా అంశాలపై జిల్లా స్థాయి ఫుడ్ సేఫ్టీ కమిటీ మరియు జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఆహార నాణ్యత మెరుగుదలకు ప్రత్యేక దృష్టి పెట్టాలని, చట్టపరమైన నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ 2006 కింద న్యాయనిర్ణేత అధికారిగా వ్యవహరిస్తూ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో ఆహార భద్రతా అధికారుల పనితీరును పర్యవేక్షించాలని తెలిపారు.జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ అధికారులకు ప్రభుత్వ నివాస విద్యాసంస్థల్లో ప్రతి నెల ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని, అత్యవసర పరిస్థితులకు మందుల నిల్వలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. కౌమారదశ బాలికలకు ఐరన్ మాత్రలు అందించి రక్తహీనత తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫుడ్ పాయిజనింగ్ ఘటనల సమయంలో ఆహార భద్రతా విభాగంతో సమన్వయం చేయాలని చెప్పారు.జిల్లా విద్యాశాఖ అధికారులకు పాఠశాలల్లో నాణ్యమైన ఆహారం అందుతున్నదీ క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, ప్రతి పాఠశాలలో ఆహార భద్రతా కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులకు వడ్డించే ముందు ఆహారాన్ని కమిటీ సభ్యులు రుచి చూసే విధానాన్ని అమలు చేయాలని, సురక్షిత తాగునీటి సరఫరా, ఆర్వో ప్లాంట్లు, నీటి ట్యాంకుల శుభ్రతపై పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. వంటగదుల్లో పరిశుభ్రత పాటిస్తూ వంటవారు చేతి తొడుగులు, టోపీలు ధరించేలా చూడాలని తెలిపారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారులకు గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆరోగ్య శిబిరాల నిర్వహణలో వైద్య శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ అఫ్ ఇండియ కింద ఉచితంగా నమోదు చేయించాలని, గ్రామపంచాయతీ స్థాయిలోని ఆహార వ్యాపార నిర్వాహకులను కూడా నమోదు చేయాలని జిల్లా పంచాయతీ రాజ్ అధికారులకు సూచించారు. మండల స్థాయిలో లైసెన్స్ మేళాలు, రిజిస్ట్రేషన్ శిబిరాల సమయంలో ఆహార భద్రతా శాఖతో సమన్వయం చేయాలని ఆదేశించారు.జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆహార వ్యాపార నిర్వాహకులు ఆహార భద్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా ఆహార భద్రత అధికారి శిరీష, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి రవీందర్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, ఫుడ్ సేఫ్టీ అధికారి విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రిడేషన్ ఉంటేనే జర్నలిస్టా? వాస్తవాలు - అపోహలు.

**బజార్హత్నూర్, మార్చి 2(డిడి9న్యూస్ ):-**




సమాజంలో జరిగే విషయాలను సేకరించి, విశ్లేషించి ప్రజల ముందుకు తీసుకువచ్చే ప్రతి వ్యక్తీ జర్నలిస్టే. జర్నలిజం అనేది ఒక బాధ్యతాయుతమైన వృత్తి. అయితే, "అక్రిడేషన్ కార్డు ఉంటేనే జర్నలిస్ట్ అవుతారు"అనేది సమాజంలో ఉన్న ఒక పెద్ద అపోహ. దీని వెనుక ఉన్న అసలు వాస్తవాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం... ఈ విషయాన్ని సులభంగా అర్థం చేసుకోవడానికి ఒక ఉదాహరణ చూద్దాం. భారత దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరూ భారతీయ పౌరులే. అయితే, ప్రభుత్వం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారిని (BPL) గుర్తించి వారికి మాత్రమే ' రేషన్ కార్డు' ఇస్తుంది. దానికి కారణం వారికి కొన్ని రాయితీలు అందించడమే. అంతమాత్రాన, రేషన్ కార్డు లేని వారు దేశ పౌరులు కాకుండా పోరు కదా! జర్నలిజం కూడా సరిగ్గా అంతే. ప్రజల కోసం వార్తలు రాసే ప్రతి ఒక్కరూ జర్నలిస్టులే, కానీ ప్రభుత్వపరమైన నిర్దిష్ట అవసరాల కోసం కొందరికి మాత్రమే ప్రభుత్వం 'అక్రిడేషన్' మంజూరు చేస్తుంది. సంస్థల చట్టబద్ధత MCA రిజిస్ట్రేషన్: వార్తలు అందించే ప్రతి డిజిటల్ మీడియా, పత్రిక లేదా న్యూస్ ఏజెన్సీ చట్టబద్ధంగా పనిచేయాలి. దీనికోసం కేంద్ర ప్రభుత్వానికి చెందిన మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ (MCA) వద్ద ఆయా సంస్థలు రిజిస్ట్రేషన్ చేసుకుంటాయి. ఈ MCA రిజిస్ట్రేషన్ అనేది ఆ సంస్థ యొక్క మనుగడకు చట్టబద్ధతను (లీగల్ ఎంటిటీ) కల్పిస్తుంది. మరి అక్రిడేషన్ కార్డు దేనికి?: మీ వార్తా సంస్థకు MCA రిజిస్ట్రేషన్ ఉన్నప్పటికీ, అందులో పనిచేసే జర్నలిస్టులకు ప్రభుత్వం అధికారికంగా కల్పించే కొన్ని సౌకర్యాలు మరియు యాక్సెస్ కోసం ' అక్రిడేషన్' అవసరం అవుతుంది. దీని ప్రధాన ఉపయోగాలు ఇలా ఉంటాయి:

* ప్రభుత్వ కార్యాలయాలు, సెక్రటేరియట్, అసెంబ్లీ మరియు పార్లమెంట్ సమావేశాలకు అధికారిక ప్రవేశం.
* ప్రభుత్వ వర్గాల నుండి సమాచారం సేకరించడానికి, ముఖ్యమైన ప్రభుత్వ కార్యక్రమాలను కవర్ చేయడానికి అనుమతి.
* జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందించే ఆరోగ్య పథకాలు (ఉదాహరణకు CGHS).
* కొన్ని ప్రత్యేక సందర్భాలలో రైల్వే టిక్కెట్లలో మరియు బస్సు ప్రయాణాల్లో రాయితీలు.

ఒక వార్తా సంస్థను చట్టబద్ధంగా నడపడానికి MCA రిజిస్ట్రేషన్ ఉపయోగపడుతుంది. ప్రభుత్వ కార్యక్రమాలకు అడ్డంకులు లేకుండా వెళ్లడానికి, సంక్షేమ పథకాలు అందుకోవడానికి అక్రిడేషన్ కార్డు ఉపయోగపడుతుంది. అంతేగానీ, సమాజాన్ని ప్రశ్నించే మరియు వార్తలు రాసే అర్హతను కేవలం ఒక కార్డు మాత్రమే నిర్ణయించలేదు. జనం పక్షాన నిలబడే ప్రతి వ్యక్తీ జర్నలిస్టే.



## పదవి విరమణ పొందిన ఉద్యోగుల సమస్యలపై బీజేపీ దీక్ష

- **ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి నిరాహార దీక్ష**

**కామారెడ్డి, మర్చి 02(డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పదవి విరమణ పొందిన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ తెలంగాణ ఆధ్వర్యంలో రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద గల ధర్నా చౌక్‌లో సోమవారం నిరాహార దీక్ష నిర్వహించారు.ఈ దీక్షలో గౌరవ కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి పాల్గొని ప్రభుత్వాన్ని ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పదవి విరమణ పొందిన ఉద్యోగులకు రావలసిన బకాయిలు, పెన్షన్ సమస్యలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలు ఆలస్యం కాకుండా చెల్లించాలని ఆయన కోరారు.దీక్షకు మద్దతుగా బీజేపీ శ్రేణులు, పదవి విరమణ పొందిన ఉద్యోగులు భారీగా హాజరయ్యారు. అనంతరం బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, పాలమూరు పార్లమెంట్ సభ్యురాలు డి.కె. అరుణ దీక్షా స్థలానికి చేరుకుని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డికి నిమ్మరసం ఇచ్చి నిరాహార దీక్షను విరమింపజేశారు.ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ, పదవి విరమణ పొందిన ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం బీజేపీ ఎప్పటికీ పోరాటం కొనసాగిస్తుందని ఆమె స్పష్టం చేశారు.



# సాలూరలో అంబరాన్నంటిన హోలీ సంబరాలు

- **హోరాహోరీగా సాగిన కుస్తీ పోటీలు**

**నిజామాబాద్ జిల్లా, 02 మార్చి(డీడీ9 వార్త) :**

సాలూర మండల కేంద్రంలో హోలీ పండుగ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. శనివారం రాత్రి గ్రామస్తులందరూ ఉత్సాహంగా పాల్గొని శాస్త్రోక్తంగా కామదహనం కార్యక్రమాన్ని నిర్వహించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా నిర్వహించిన ఈ వేడుకలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆదివారం ఉదయం నుండే రంగుల పండుగ హోలీ వేడుకలు గ్రామంలో మిన్నంటాయి. యువతీ యువకులు, చిన్న పిల్లలు మరియు పెద్దలు అందరూ కలిసి ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ, పరస్పరం హోలీ శుభాకాంక్షలు తెలుపుకుంటూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. గ్రామ వీధులన్నీ రంగులమయంగా మారి కోలాహల వాతావరణం నెలకొంది. ఈ పండుగ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచిన కుస్తీ పోటీలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మన ప్రాచీన గ్రామీణ క్రీడలను, శౌర్యాన్ని ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండే కాకుండా, పొరుగు ప్రాంతాల నుండి వచ్చిన హేమాహేమీలైన మల్లయోధులు తలపడ్డారు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ కుస్తీలను వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలు వేల సంఖ్యలో తరలివచ్చారు. మల్లయోధులు తమ పట్టులతో, ఎత్తుగడలతో ప్రత్యర్థులను చిత్తు చేస్తుంటే ప్రేక్షకుల ఈలలు, కేకలతో సాలూర గ్రామం మారుమోగిపోయింది. గ్రామీణ సంస్కృతిని, క్రీడలను కాపాడుకోవాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామని, ఈ వేడుకలు గ్రామంలో ఐక్యతను చాటుతాయని గ్రామ పోలీస్ పటేల్ వెంకట్ రావు ఈ సందర్భంగా తెలియజేశారు. విజేతలకు నిర్వాహక కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు. చిన్నారులు, మహిళలు జాతరలో సందడి చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు రక్షణ చర్యలు చేపట్టారు.



# గల్ఫ్ బాధితుల కోసం 24/7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు : సీపీ సాయి చైతన్య

- **హోలీకి పటిష్ట బందోబస్తు**

**నిజామాబాద్ జిల్లా, 02 మార్చి(డీడీ9 వార్త) :**

గల్ఫ్ దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా జిల్లా వాసుల సహాయార్థం ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు, హోలీ పండుగను పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా మద్యం దుకాణాలను మూసి వేయాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాలు జారీ చేశారు. గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న నిజామాబాద్ జిల్లా పౌరుల సమాచారం, సహాయం కోసం కమిషనరేట్ కార్యాలయంలో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని, ఇది న్యూఢిల్లీలోని తెలంగాణ ప్రభుత్వ సహాయ కేంద్రంతో నిరంతరం సమన్వయం చేసుకుంటుందని ఆయన తెలిపారు. బాధితుల కుటుంబ సభ్యులు వివరాల కోసం నిజామాబాద్ పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712659700 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నంబర్ 8712659821 ను సంప్రదించాలని కోరారు. మరోవైపు, హోలీ పండుగ, కామ దహనం నేపథ్యంలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం తెలంగాణ ఎక్సైజ్ యాక్ట్ 1968, సెక్షన్ 20(1) ప్రకారం నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలోని అన్ని మద్యం దుకాణాలు (A4), కల్లు డిపోలు, బార్లు, క్లబ్బులు మరియు ఇతర విక్రయ కేంద్రాలను తేదీ 03 సాయంత్రం 6 గంటల నుండి తేదీ 05 ఉదయం 6 గంటల వరకు మూసివేస్తున్నట్లు కమిషనర్ స్పష్టం చేశారు. హోలీ పండుగను ప్రజలంతా సంప్రదాయ పద్ధతుల్లో, సహజ సిద్ధమైన రంగులతో శాంతియుతంగా జరుపుకోవాలని, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు




చేశామని తెలిపారు. వేడుకల అనంతరం యువత చెరువులు, కుంటలు వంటి లోతట్టు ప్రాంతాల్లో స్నానాలకు వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలను గమనిస్తూ ఉండాలని సూచించారు. జిల్లా ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# ఆదిలాబాద్ పురపాలక సంఘం అధ్యక్షురాలు బండారి అనూష సతీష్ కు దేగామలో సన్మానం.

**బజార్హత్నూర్,మార్చి 2(డిడి9న్యూస్ ):-**

ఆదిలాబాద్ పురపాలక సంఘం కు ఇటీవల జరిగిన ఎన్నికలలో గెలిసి అధ్యక్ష పీఠాన్ని దక్కించుకొన్నబండారి అనూష సతీష్ లకు బజార్హత్నూర్ మండలంలోని దేగామ గ్రామం లోని మున్నూరు కాపు సంఘం అధ్వర్యం లో సోమవారం రోజు ఘన సన్మానం చేశారు.ఈ కార్యక్రమానికి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఆయన మాట్లాడుతూ "ఆదిలాబాద్ పుర పాలక సంఘం అధ్యక్షులు బండారి అనూష సతీష్ లు మన ఇంటి బిడ్డే, మన నియోజకవర్గ బిడ్డే ప్రజల ఆశీర్వాదంతో ఈ స్థాయికి చేరుకున్నారని అన్నారు.బండారి అనూష సతీష్ ఆదిలాబాద్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, బజార్ హత్నూర్ మండల అధ్యక్షుడు జల్కె పాండురంగ్, మోర్కండి సర్పంచ్ తొడసం నాందేవ్, చందునాయక్ తండా సర్పంచ్ రజాక్, కళ్ళెం విఠల్,పోరెడ్డినారాయణ, నరేష్,దేవన్న, శివుడు, సయ్యద్ సల్మాన్, సూర్యవంశీ పాండురంగ్,కిషన్ తదితరులు ఉన్నారు.





# దుద్దిళ్ల శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయం.

**బజార్ హత్నూర్మార్చి2(డీడీ9 వార్త) :-**

మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను బజార్ హత్నూర్ లోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నాడు ఘనంగా నిర్వహించారు. రెవిన్యూ అధికారుల అధ్వర్యంలోడి.శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్యామ్ సుందర్ మాట్లాడుతూ శ్రీపాదరావు సౌమ్య మనస్తత్వం గల నాయకుడని, నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి కష్టనష్టాల్లో పాలుపంచుకున్న ప్రజా నాయకుడని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ స్పీకర్‌గా ఆయన చూపిన నిజాయితీ, నిరాడంబరత నేటికీ ఆదర్శప్రాయమన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ఆయనచేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్తో పాటు డిప్యూటీ తహసీల్దార్ పవార్ హీరాలాల్,ఆర్ ఐ లు ఏ ఆర్ మహేందర్, రాథోడ్ నూర్ సింగ్, సర్వేయర్ బాపూరావ్,కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ కే. స్రవంతి, గ్రామాల పాలన అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# బాన్సువాడ ఘటనలో అమాయకుల అరెస్టులు... ఎంఐఎం మెప్పుకోసమేనా?

- **కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపణ**

**కామారెడ్డి, మార్చి 02 (డిడి9 వార్త):**

కామారెడ్డి పట్టణ కేంద్రంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో సోమవారం బాన్సువాడ ఘటనలో అరెస్ట్ అయిన బాధిత కుటుంబాలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.బాన్సువాడలో ఇటీవల జరిగిన ఘటనలో ఎంఐఎం మెప్పుకోసమే ప్రభుత్వం అమాయకులను అరెస్ట్ చేసిందని ఆయన ఆరోపించారు. ఘటనలో అరెస్ట్ అయి జైలులో ఉన్న వారి కుటుంబాలకు ధైర్యం చెప్పిన బండి సంజయ్, పూర్తి స్థాయి విచారణ లేకుండానే 17 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారని మండిపడ్డారు. కిరాణా సామగ్రి కొనుగోలుకు వచ్చిన వ్యక్తిని కేవలం వీడియోలో కనిపించాడనే కారణంతో అరెస్ట్ చేయడం దారుణమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, కాంగ్రెస్ కార్యకర్తలు తలుచుకుంటే వేల కోట్ల రూపాయలు వసూలు చేసి ఢిల్లీకి పంపగలరని చెప్పడం బాధాకరమన్నారు. రాష్ట్రానికి వచ్చిన రాహుల్ గాంధీ కార్యకర్తలకు ఏ అంశంపై శిక్షణ ఇచ్చేందుకు వచ్చారో ప్రజలకు తెలియజేయాలని ప్రశ్నించారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దేవాలయాలపై దాడులు, హైడ్రా కూల్చివేతల విషయంలో ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపించిన ఆయన, పేదల ఇళ్లను కూల్చి వేస్తూ పెద్దల ఇళ్లపై చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తోందన్నారు. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు.రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులు నెలకొన్నాయని వ్యాఖ్యానించిన బండి సంజయ్, దాడులు చేస్తే చేతులు ముడుచుకుని కూర్చోమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముక్త భారత్ లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు తదితరులు పాల్గొన్నారు.



# హోళికా (కామ) దహనం



**ఆదిలాబాద్ జిల్లా, (డి డి 9)**

బోథ్ పట్టణలోని అన్ని పుర విధుల్లో కామ దహన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమం లో చిన్న పెద్ద & మహిళలు పట్టణ ప్రజలు అందరూ కలిసి పాల్గొన్నారు. భౌతిక కామ వాంఛలన్నీ తగలబెట్టి, ధర్మ బద్ధంగా జీవితం గడపాలనే ఉద్దేశ్యంతో కామ దహనం యొక్క పరమార్ధం. మన భారతీయ హిందూ సాంప్రదాయ, ఆచార వ్యవహారాలలో పండగలు అనేవి ఆయా పర్వ దినానికి సంబంధించిన ఒక ప్రత్యేక తిథి, నక్షత్ర రోజులలో తెలుగు నెలల ఆధారంగా వేడుక జరుపుకోవడం జరుగుతుంది. ప్రతి సంవత్సరం ఇది పునారావృతం అవుతుంది. ఒక ప్రత్యేకమైన పండుగను అదే ప్రత్యేకమైన రోజునాడు ఎందుకు జరుపు కోవాలి అనేది జ్యోతిష ఆధారంగా తెలుస్తుంది. ప్రస్తుత హోలీ పండగ అనేది ఎప్పుడు, ఏలా జరుపుకోవాలి అనే విషయంలో ధర్మసింధు,నిర్ణయ సింధు మొదలగు ప్రామాణిక గ్రంధాల ఆధారంగా వివరణ పరిశీలించి చూడగా కామదహనం అనేది పాల్గుణ మాస, పౌర్ణిమ రోజు చేయాలని నిర్ణయం చేసారు, అందుకేకామునిపున్నమి అనే పేరు వచ్చింది. ఈ పండగను యావత్ భారత దేశ ప్రజలు అన్ని ప్రాంతలవారు ఆనందంగా జరుపుకుంటారు. ఈ సందర్బంగా హోళికా కథ ను పలువురు చర్చించుకోవడం.జరిగింది



# మొకిలా అసైన్డ్ భూమిని కాపాడండి

- **ఎమ్మార్వో సురేందర్ వినతి కు పత్రం అందజేత.**

**శంకర్ పల్లి మార్చి 02(డిడి9 వార్త):**

మొకిలలోని మిగులు అసైన్ భూమిని కాపాడాలని సోమవారం శంకర్ పల్లి ఎమ్మార్వో సురేందర్ కు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మొకిల గ్రామంలో సర్వే నంబర్ 31 లో ఈ మిగులు భూమిని అప్పటి గ్రామ పంచాయతీ లో హాస్పిటల్, అట స్థలానికి కేటాయించాలని తీర్మాణం చేశారన్నారు. కానీ ప్రస్తుతం కొందరు వ్యక్తులు ఆక్రమించి విక్రయంచేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజ ప్రయోజనం కోసం కేటాయించిన స్థలాలను ఆక్రమిస్తే ఊరుకోనేది లేదని, భూములను ఆక్రమిస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని అన్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే చర్యలు చేపట్టి స్థలాలను ప్రజాప్రయోజనం కోసం వినియోగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిల్ కుమార్, ల్యాగాల నర్సిములు (ఎల్ఎన్ ఆర్), కావలి సురేందర్, నయీమ్, రజాక్, శ్రీను, కిరణ్, ప్రసాద్, లక్ష్మణ్, కరుణాకర్, డేనియల్, కుమార్, జావేద్, నారుద్దీన్, మాణిక్ ప్రభు, నర్సింలు, ఎన్ శ్రీను, లక్ష్మయ్య, అనంతయ్య, బడే సంజయ్, అజర్ తదితరులు పాల్గొన్నారు.



# సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో శ్రీ విద్యా సాయి పాఠశాల విద్యార్థుల ప్రతిభ

**నిజామాబాద్ జిల్లా, 02 మార్చి(డీడీ9 వార్త) :**

కమ్మర్ పల్లి మండలంలోని శ్రీ విద్యా సాయి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి అర్హత సాధించారు. శనివారం వెలువడిన ఈ ఫలితాల్లో పాఠశాల విద్యార్థులు భూక్యా రామ్ చరణ్, మైలరం మన్విత్, దేగవత్ అశ్వంత్ లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం సోమవారం విద్యార్థులను ప్రత్యేకంగా సన్మానించి అభినందనలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఏనుగు గంగారెడ్డి గారు మాట్లాడుతూ... విద్యార్థుల కష్టానికి, ఉపాధ్యాయుల శిక్షణ తోడవడంతోనే ఈ విజయం సాధ్యమైందని కొనియాడారు. ప్రధానోపాధ్యాయుడు మంద శ్రీనివాస్ మాట్లాడుతూ... జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో తమ పాఠశాల విద్యార్థులు రాణించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ అభినందన సభలో ఉపాధ్యాయులు జాగర్ల పవన్ కుమార్, సుంకరి సురేష్, నకుల్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.




# పోలీస్ ప్రజావాణిలో 34 ఫిర్యాదుల స్వీకరణ

**నిజామాబాద్ జిల్లా, 02 మార్చి(డీడీ9 వార్త) :**




నిజామాబాద్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య స్వయంగా ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మొత్తం 34 ఫిర్యాదులను స్వీకరించిన కమిషనర్ ఆయా సమస్యల స్థితిగతులపై సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్.ఐ మరియు సి.ఐలతో ఫోన్ ద్వారా మాట్లాడి తక్షణ పరిష్కారానికి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ గారు మాట్లాడుతూ.. ప్రజలు ఎటువంటి మధ్యవర్తులు లేదా పైరవీల ప్రమేయం లేకుండా నేరుగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని, చట్ట ప్రకారం తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ప్రజలకు పోలీసులు మరింత చేరువయ్యేలా, శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రతి సోమవారం నిర్వహించే ఈ ప్రజావాణి కార్యక్రమం ద్వారా బాధితుల సమస్యలను నేరుగా స్వీకరించి వాటిని త్వరితగతిన పరిష్కరిస్తున్నామని ఆయన తెలియజేశారు.

## క్లాసికల్ లుక్‌లో 'స్వయంభూ' సుందరి

# నభా నటేష్ మేకోవర్ అదిరింది!



సినిమా ఇండస్ట్రీలో ఒక ముద్ర వేయడం వేరు, వేసిన ముద్రను చెరిపి కొత్త రూపాన్ని ఆవిష్కరించుకోవడం వేరు. సరిగ్గా ఇదే మ్యాజిక్‌ను ఇప్పుడు నభా నటేష్ చేసి చూపిస్తోంది. ఇప్పటి వరకు మనందరికీ తెలిసిన నభా అంటే.. 'ఇస్మార్ట్ శంకర్'లో తన చలాకీతనంతో థియేటర్లను ఊపేసిన వైబ్రెంట్ బ్యూటీ. కానీ, ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆమె ఫోటోలు చూస్తుంటే, మన కళ్ళ ముందు ఒక కొత్త నభా కనిపిస్తోంది.

**ఆ కళ్ళలో ఏదో మ్యాజిక్ ఉంది!**

తాజాగా నభా నటేష్ తన 'క్లాసికల్ వెర్షన్'ను పరిచయం చేసింది. పట్టు చీర కట్టుకొని, నుదుట బొట్టు పెట్టి, ముక్కు పుడకతో ఆమె చిరునవ్వు చిందిస్తుంటే.. ఏదో పురాతన కావ్యంలోని నాయిక మళ్ళీ పుట్టిందా అన్నట్లుగా ఉంది. కేవలం ఫోటో షూట్ కోసమే కాకుండా, తన పాత్రల కోసం ఆమె చేస్తున్న ఈ మేకోవర్ వెనుక పెద్ద కసరత్తే కనిపిస్తోంది. ఈ క్లాసికల్ ఎలిగాన్స్ ఆమె కేవలం అందాన్ని మాత్రమే కాదు, ఆమెలోని నటనా పరిణితిని (Acting Maturity) కూడా చాటిచెబుతోంది.

**ప్రయోగానికి మారుపేరుగా 'స్వయంభూ'..**

నభా ఇప్పుడు కేవలం కమర్షియల్ సినిమాలకే పరిమితం కావడం లేదు. నిఖిల్ హీరోగా వస్తున్న 'స్వయంభూ' చిత్రం ఆమె కెరీర్‌లో ఒక పెద్ద టర్నింగ్ పాయింట్ కానుంది. ఈ సినిమా కోసం ఆమె ప్రత్యేకంగా గుర్రపు స్వారీ, యుద్ధ విద్యల్లో శిక్షణ తీసుకోవడం విశేషం. గ్లామర్ పాత్రల్లో ఒదిగిపోయే నభా, ఇప్పుడు ఖడ్గం పట్టి యుద్ధ రంగంలో ఎలా మెరిసిపోనుందో అని టాలీవుడ్ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

**'నాగబంధం'తో సరికొత్త ప్రయోగం!**

దీనితో పాటు 'నాగబంధం' వంటి విభిన్నమైన కథాంశం ఉన్న సినిమాలో కూడా ఆమె భాగం కావడం, నభా తన సెకండ్ ఇన్నింగ్స్‌ను ఎంత పకడ్బందీగా ప్లాన్ చేసుకుందో అర్థమవుతోంది. ఒకప్పుడు తన ఎనర్జీతో అలరించిన ఈ కన్నడ కస్తూరి, ఇప్పుడు తన గాంభీర్యంతో (Grace) ప్రేక్షకులను కట్టిపడేయడానికి సిద్ధమైంది. నభాలోని ఈ 'క్లాసికల్ ట్రాన్స్‌ఫర్మేషన్' కేవలం లుక్ మార్పు మాత్రమే కాదు.. ఇది ఒక నటిగా తను వేస్తున్న కొత్త అడుగు. ఆమె చేస్తున్న ఈ సాహసోపేతమైన ప్రయాణం వెండితెరపై మరిన్ని అద్భుతాలు సృష్టిస్తుందనడంలో సందేహం లేదు.



## విజయ్‌రష్మిక రిసెప్షన్: సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ఆహ్వానం!



ఒకరినొకరు అర్థం చేసుకున్న మనసులు, ఏళ్ల నాటి స్నేహం.. వెరసి విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ఇప్పుడు అధికారికంగా 'మిస్టర్ అండ్ మిసెస్ దేవరకొండ' అయిపోయారు. అత్యంత గోప్యంగా, కేవలం కుటుంబ సభ్యుల సమక్షంలో జరిగిన వీరి వివాహ వేడుక ముగియడంతో, ఇప్పుడు అందరి కళ్లు మార్చి 4న హైదరాబాద్‌లో జరగనున్న మహా రిసెప్షన్ వైపు మళ్లాయి.

**ముఖ్యమంత్రికి దంపతుల ఆహ్వానం**

పెళ్లి తంతు ముగిసిన వెంటనే, ఈ నూతన దంపతులు తమ కొత్త జీవితాన్ని ఆశీర్వదించాల్సిందిగా కోరుతూ ప్రజా ప్రతినిధులను, రాజకీయ దిగ్గజాలను కలుస్తున్నారు. అందులో భాగంగానే తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డిని కలిసి, తమ రిసెప్షన్‌కు రావాలని రష్మిక మరియు విజయ్ సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రితో పాటు ఆయన కుటుంబ సభ్యులు కూడా ఈ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను దీవించనున్నారు.

**గ్లామర్ లోకపు 'గ్రాండ్' విందు!**

హైదరాబాద్‌లోని ఒక ఖరీదైన వేదికపై జరగబోయే ఈ రిసెప్షన్ కోసం ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి.

**స్టార్ పవర్:**

టాలీవుడ్ టాప్ హీరోలు చిరంజీవి, ప్రభాస్, ఎన్టీఆర్ వంటి వారితో పాటు రష్మికకు బాలీవుడ్‌లో ఉన్న స్నేహితులు (రణబీర్ కపూర్ వంటి వారు) కూడా హాజరయ్యే అవకాశం ఉందని టాక్.

**కోచర్ అండ్ స్టైల్:**

పెళ్లిలో సాంప్రదాయంగా మెరిసిన ఈ జంట, రిసెప్షన్‌లో మాత్రం వెస్ట్రన్ అండ్ రాయల్ లుక్‌లో కనిపించబోతున్నారట. రష్మిక ధరించబోయే లెహంగా ప్రత్యేకంగా ఒక టాప్ డిజైనర్ రూపొందించినట్లు సమాచారం.

**అభిమానుల కోలాహలం**

తమ అభిమాన నటులు ఒకటయ్యారనే వార్తతో సోషల్ మీడియా అంతా పండగ వాతావరణం నెలకొంది. 'విజయ్‌రష్మిక' అనే హ్యాష్‌ట్యాగ్ గంటల వ్యవధిలోనే మిలియన్ల కొద్దీ ఇంప్రెషన్స్ సాధించింది. తెరపై 'గీత గోవిందం'గా మనం చూసిన ఆ అందమైన కెమిస్ట్రీ, ఇప్పుడు నిజ జీవితంలో శాశ్వత బంధంగా మారడం చూసి ఫ్యాన్స్ మురిసిపోతున్నారు.

మార్చి 4న జరగబోయే ఈ వేడుక టాలీవుడ్ చరిత్రలోనే అత్యంత వైభవంగా నిలిచిపోనుంది. ఒకే వేదికపై సినిమా, రాజకీయం మరియు గ్లామర్ ప్రపంచాలు కలవబోతున్నాయి!

# దుబాయ్‌లో క్షేమంగా ఉన్నాం




దుబాయ్‌లో తాము క్షేమంగానే ఉన్నామని నటుడు మంచు విష్ణు తెలిపారు. అప్పుడప్పుడు దూరం నుంచి శబ్దాలు వినిపిస్తున్నాయని, అదిమినహా అంతా ప్రశాంతంగా ఉందన్నారు. తాము క్షేమంగా ఉండాలని ప్రార్థించిన వారందరికీ కృతజ్ఞతలు చెప్పారు. ఉద్రిక్త పరిస్థితుల్లో దుబాయ్ ప్రభుత్వం తీసుకున్న రక్షణ చర్యలను విష్ణు కొనియాడారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు.

ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య యుద్ధం నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. గల్ఫ్ ప్రాంతంలో గగనతలాన్ని మూసి వేయడంతో అనేక విమాన సర్వీసులకు అంతరాయం కలిగింది. దుబాయ్‌లో చిక్కుకున్న వారిలో మంచు విష్ణు ఫ్యామిలీ కూడా ఉంది. దుబాయ్ గగనతలంలో ఇరాన్ క్షిపణుల దృశ్యాలను అప్పుడే ఎక్స్‌లో పోస్టు చేస్తూ విష్ణు ఆందోళన వ్యక్తం చేశారు. ఏ చిన్నారీ ఇలాంటి యుద్ధ వాతావరణంలో పెరగకూడదన్నారు. నటి సోనాల్ చౌహాన్ కూడా దుబాయ్‌లో చిక్కుకోగా.. తనను భారత్‌కు చేర్చాలంటూ ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేస్తూ పోస్టు పెట్టారు.

# రామ్ చరణ్ vs ధనుష్.. ఏప్రిల్‌లో ఆసక్తికర పోటీ

అగ్ర హీరోల సినిమాలతో బాక్సాఫీసు వద్ద ఈ వేసవిలో హీట్ పెరగనుంది. మార్చిలో పవన్ కల్యాణ్ 'ఉస్తాద్ భగత్‌సింగ్', యశ్ 'టాక్సిక్', రణ్‌వీర్‌సింగ్ 'ధురంధర్ 2' సినిమాలు విడుదల కానున్నాయి. ఏప్రిల్‌లోనూ స్టార్ హీరోల చిత్రాలతో సందడి నెలకొననుంది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది'. ఈ సినిమాని ఏప్రిల్ 30న రిలీజ్ చేయనున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ధనుష్ మూవీ 'కర'నూ అదే తేదీన విడుదల చేయనున్నట్లు టీమ్ తాజాగా ప్రకటించింది. ఈ తమిళ మూవీ తెలుగులోనూ రిలీజ్ కానుంది. దీంతో, ఒకే రోజు ఈ స్టార్ల సినిమాలు విడుదల కానుండడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. 'కర' చిత్రానికి 'పోర్ తొళిల్' ఫేమ్ విఘ్నేశ్ రాజా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాని థ్రిల్లర్‌గా రూపొందిస్తున్నట్లు సమాచారం. 'పెద్ది' విషయానికొస్తే.. రామ్‌చరణ్ తాజాగా తన పాత్రకు డబ్బింగ్ ప్రారంభించారు. జాన్వీ కపూర్ హీరోయిన్ కాగా శివ రాజ్‌కుమార్, జగపతిబాబు తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మరోవైపు, ఏప్రిల్ 2న మోహన్‌లాల్ 'దృశ్యం 3', ఏప్రిల్ 23న మోహన్‌లాల్ మమ్ముట్టిల 'పేట్రియాట్' విడుదల కానున్నాయి.







## సిగరెట్ మందు గురించి ఓపెన్ అయిన బ్యూటీ..

వరుస సినిమాలతో ప్రస్తుతం తెలుగు సినిమా పరిశ్రమలో సూపర్ స్పీడులో దూసుకుపోతున్న ముద్దుగుమ్మలలో నయన్ సారిక ఒకరు. తాజాగా ఈమె శ్రీ విష్ణు హీరోగా రూపొందిన విష్ణు విన్యాసం చిత్రంలో హీరోయిన్గా నటించింది. ఈ సినిమా ఫిబ్రవరి 27వ తేదీన విడుదలైంది. తాజాగా ఈ మూవీ బృందం వారు ఓ ఈవెంట్ ఏర్పాటు చేశారు. అందులో భాగంగా ఈమెకు 'మీరు సిగరెట్ బాగానే కాల్చారు, మందు కూడా బాగానే తాగారు, అదంతా నిజమేనా?' అనే ప్రశ్న ఎదురయింది. దానికి ఈ బ్యూటీ సమాధానం చెబుతూ... "నేను కాల్చిన సిగరెట్ మరియు తాగిన మందు రెండు ఒరిజినల్ కాదు. మందు తాగే సీన్లో నాకు నీళ్లు ఇచ్చారు. నేను నీళ్లు తాగి మందు తాగినట్లుగా నటించాను. ఇక సిగరెట్ కూడా డమ్మీనే. ఆ రెండింటిలో ఏదీ కూడా ఒరిజినల్ కాదు" అని ఈ బ్యూటీ సమాధానం ఇచ్చింది. నయన్ నటిస్తున్న సినిమాలు మంచి విజయాలను సాధిస్తూ ఉండడం, అందులో ఈ బ్యూటీ తన అందంతో, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వెళ్లడంతో మంచి అవకాశాలు ఈమెకు దక్కుతున్నాయి.

తాజాగా నయన్ నటించిన విష్ణు విన్యాసం సినిమాకి నెగిటివ్ టాక్ వచ్చింది. కానీ ఈ మూవీ మొదటి వీకెండ్ పూర్తయ్యేసరికి పర్వాలేదనే రేంజ్ కలెక్షన్లనే రాబట్టింది. టోటల్ రన్ కంప్లీట్ అయ్యేసరికి ఈ చిత్రం ఎలాంటి వసూళ్లను రాబట్టి ఏ రేంజ్ విజయాన్ని సొంతం చేసుకుంటుందో చూడాలి. ఈ మూవీలోని ఈ బ్యూటీ నటనకు మంచి ప్రశంసలు దక్కుతున్నాయి.



## 'మంజుమ్మల్ బాయ్స్' దర్శకుడిపై లైంగిక వేధింపుల కేసు



మలయాళ చిత్ర పరిశ్రమతో పాటు విడుదలైన అన్ని భాషల్లోనూ ఆదరణ సొంతం చేసుకున్న చిత్రం 'మంజుమ్మల్ బాయ్స్'. ఇప్పుడీ చిత్ర దర్శకుడు చిదంబరం వివాదంలో చిక్కుకున్నారు. కేరళలోని ఎర్నాకుళం పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై లైంగిక వేధింపుల కేసు నమోదవడం చర్చనీయాంశంగా మారింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ మహిళ చిదంబరంపై ఆరోపణలు చేశారు. 2022లో దర్శకుడు తనను లైంగికంగా వేధించారని ఆమె ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయనపై కేసు నమోదు చేశారు. దీనిపై విచారణకు హాజరుకావాలని దర్శకుడికి నోటీసులు జారీ చేశారు. దీనిపై చిదంబరం స్పందించాల్సి ఉంది. 2021లో 'జాన్.ఈ.మ్యాన్' అనే చిత్రంతో ఇండస్ట్రీకి వచ్చిన ఆయన 2024లో 'మంజుమ్మల్ బాయ్స్'తో గుర్తింపు తెచ్చుకున్నారు.

## దండోరా విషయంలో అన్ని తప్పులు జరిగాయి



కొన్ని రోజుల క్రితం శివాజీ 'దండోరా' అనే చిత్రంతో ప్రేక్షకులను పలకరించాడు. ఈ సినిమాకు ప్రేక్షకుల, విమర్శకుల నుండి మంచి ప్రశంసలు దక్కినప్పటికీ భారీ విజయాన్ని మాత్రం సొంతం చేసుకోలేదు. తాజాగా శివాజీ ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. అందులో దండోరా ఫెయిల్యూర్ కావడానికి గల కారణాలను ఆయన వివరించారు. శివాజీ మాట్లాడుతూ... దండోరా ఫెయిల్యూర్ కావడానికి మొదటి కారణం సినిమా రిలీజ్ డేట్, అది రాంగ్ రిలీజ్ డేట్.

డిసెంబర్ 25వ తేదీన మేము సినిమాను విడుదల చేయాలి అనుకున్నాం. 24వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు సినిమా సెన్సార్ పూర్తి అయ్యింది. దానితో మా మూవీకి ఎవరూ థియేటర్స్ ఇవ్వలేదు. అందుకు కారణం సెన్సార్ అవుతుందో, లేదో అనే భయంతోనే ఎవరూ థియేటర్స్ ఇవ్వలేదు. సహజంగా అలా జరిగిన సినిమాలకు థియేటర్స్ ఇవ్వరు. ఇక ఆ కథకి ఆ టైటిల్ అస్సలు కరెక్ట్ కాదు, నేను స్క్రిప్ట్ చెప్పిన గంటకే ఆ విషయం చెప్పాను. అలాగే ఒక నెల రోజులు పాటు టైటిల్ మార్చడానికి ప్రయత్నించాను. మన సమాజంలో దండోరా అనే టైటిల్ వినగానే కమ్యూనిస్టు సినిమా అని అనుకున్నారు. అలాగే హైదరాబాద్ సిటీలో మాకు సాయంత్రం 4, 10 గంటలకు షోలు ఇచ్చారు. అంతకుమించి షోలు పెద్దగా ఇవ్వలేదు. కానీ మా సినిమా నైజాం ఏరియాలో ఒక కోటి కలెక్షన్లను రాబట్టింది. అంత తక్కువ షోలతో కూడా ఆ సినిమా మంచి కలెక్షన్లను రాబట్టింది. అదే ఎక్కువ స్క్రీన్లు ఉంటే భారీ కలెక్షన్లు వచ్చేవి. ఇలా కొన్ని కారణాలవల్ల దండోరా సినిమా ఫెయిల్యూర్ అయింది అని శివాజీ చెప్పుకొచ్చాడు.